

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 25 డిసెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 120 పేజీలు : 4 వెల : రూ 3-00


## అశోక్ గజపతిరాజుకు 41ఏ సీఆర్‌పీసీ నోటీసులు



విజయనగరం: రామతీర్థం ఘటనకు సంబంధించి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజుకు 41ఏ సీఆర్‌పీసీ నోటీసులను పోలీసులు అందజేశారు. అవసరమైనప్పుడు విచారణకు హాజరుకావాలని పోలీసుల నోటీసులు ఇచ్చారు. కాగా,, రెండో భద్రాద్రిగా భాసిల్లుతున్న విజయనగరం జిల్లా రామతీర్థం బోడికొండపై కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు టీడీపీ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు అడ్డు తగిలి వీరంగం సృష్టించిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం శంకుస్థాపన సమయానికి ముందుగానే కొందరు టీడీపీ కార్యకర్తలను వెంటబెట్టుకుని ఆయన బోడికొండ పైకి చేరుకున్నారు.రామతీర్థం దేవస్థానం తన పూర్వీకులదని, అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఎలా శంకుస్థాపన చేస్తుందంటూ దేవదాయ శాఖ అధికారులపై చిందులేశారు. శంకుస్థాపన కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కిందకి తోసేశారు. అనువంశిక ధర్మకర్తనైన తనకు తెలియకుండా ముహూర్తం ఎలా నిర్ణయిస్తారంటూ కేకలు వేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న మంత్రులతో వాగ్వాదానికి దిగారు. ఆలయ ఈవో ప్రసాద్ ఫిర్యాదు మేరకు నెలిమర్ల పోలీస్ స్టేషన్‌లో అశోక్ గజపతిరాజు కేసు నమోదైన సంగతి తెలిసిందే. రామతీర్థంలో రామాలయ పునర్నిర్మాణ శంకుస్థాపనను అడ్డుకొని ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని అశోక్‌గజపతిరాజుపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అశోక్‌గజపతి రాజుపై 427, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిలో భాగంగా తాజాగా అశోక్ గజపతిరాజుకు అవసరమైనప్పుడు విచారణకు హాజరుకావాల్సి ఉంటుందంటూ 41ఏ సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చారు.


## పులివెందులలో 323 ఎకరాల్లో జగనన్న కాలనీ: సీఎం జగన్





వైఎస్సార్ కడప: మూడు రోజుల కడప జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పులివెందుల నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ.. పులివెందులలో 323 ఎకరాల్లో జగనన్న కాలనీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో ఇంటి పట్టా విలువ కనీసం రూ. 2 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. రూ. 147 కోట్లతో జగనన్న కాలనీ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారుజగనన్న కాలనీలో 8042 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు సీఎం జగన్ తెలిపారు. ప్రభుత్వం ఒక్కో ఇంటిపై రూ. 6 లక్షలు ఖర్చు పెడుతోందని పేర్కొన్నారు. కోర్టు కేసుల కారణంగా కార్యక్రమం ఆలస్యమయిందన్నారు. జగనన్న కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయల అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. జగనన్న కాలనీకి సమీపంలోనే ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు, నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.నియోజక వర్గంలో ఆక్వాహబ్ సహా అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పులివెందులలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌కు రూ. 100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పులివెందులలో రూ. 65 కోట్లతో సమగ్రనీటి పథకం, నియోజకవర్గంలో ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా అందించనున్నట్లు చెప్పారు. ప్రతి మండలానికి మర్కెటింగ్ గిడ్డంగి నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో నిర్వహించడంపై ఏపీ హైకోర్టులో విచారణ



అమరావతి : ఏపీలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో కూడా నిర్వహించకపోవడంపై హైకోర్టులో విచారణ జరిగింది. తెలుగులో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు ఎందుకు నిర్వహించడం లేదని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ వేసిన పిటిషన్‌పై కోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ వాదనలను న్యాయవాది పారా కిషోర్ వినిపించారు. గతంలో చీఫ్ సెక్రటరీకి హైకోర్టు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అఫిడవిట్ వేసేందుకు సమయం కావాలని ప్రభుత్వం కోరింది. తెలుగులో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించాలని పిటిషనర్ కోరారు. ఆరు వారాల్లో పూర్తి అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న శ్రీలంక ప్రధాని రాజపక్సే

తిరుమల: శ్రీలంక ప్రధాని మహింద రాజపక్సే కుటుంబ సమేతంగా శుక్రవారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం తిరుమలలోని శ్రీకృష్ణ విశ్రాంతి గృహం వద్దకు ఆయనకు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, టీటీడీ ఏఈవో ఎవీ ధర్మారెడ్డి, తదితరులు స్వాగతం పలికారు. అంతకముందు రేణిగుంట విమానాశ్రయంలో మహింద రాజపక్సేకు సాదర స్వాగతం లభించింది. విమానాశ్రయంలో వారిని భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు స్వాగతం పలికారు.



## 27 శాతం పేషెంట్లకు నో ట్రావెల్ హిస్టరీ.. 91 శాతం ఫుల్ వాక్సినేటెడ్!

ఒమిక్రాన్ కరోనావైరస్ వేరియెంట్ శరవేగంగా విస్తరిస్తోందంటూ రాష్ట్రాలకు కేంద్రం? మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. పండుగ-సెలవుల సీజన్ కావడంతో రాత్రిపూట కర్ఫ్యూ విధించాలని ఇదివరకే అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో పెరుగుతున్న కేసుల వివరాలను వెల్లడిస్తూ.. మరోసారి అప్రమత్తం చేసింది.తాజాగా శుక్రవారం సాయంత్రం దేశంలో నమోదైన ాఎతిఇతీనిని అజీబవబ వివరాల్ని యూనియన్ హెల్త్ సెక్రటరీ రాజేష్ భూషణ్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. మొత్తం 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి ఇప్పటిదాకా 358 ఒమిక్రాన్ కేసులు నమోదు అయినట్లు వెల్లడించింది. ఇందులో 244 యాక్టివ్ కేసులు ఉన్నట్లు, 114 మంది పేషెంట్లు ఒమిక్రాన్ వేరియెంట్ నుంచి కోలుకున్నట్లు తెలిపింది. మహారాష్ట్రలో అధికంగా 88, ఢిల్లీలో 67, తెలంగాణ 38, తమిళనాడు 34, కర్ణాటక 31, గుజరాత్ 30, కేరళ 27, రాజస్థాన్ 22 కేసులు నమోదు అయినట్లు ప్రభుత్వం తెలిపింది. హర్యానా, ఒడిషా, జమ్ము కశ్మీర్, ఏపీ, యూపీ, ఛండీగఢ్, లడక్‌లలో కేసులు నమోదు అయ్యాయి. ఒక్కరోజులో 122కేసులు రావడం ఆందోళన కలిగించే అంశమని కేంద్రం ప్రకటించింది.

## ఆపన్నులకు అండదండలు అందించండి



### గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్

### వరద బాధితుల సహాయార్థం రూ.25 లక్షలు విడుదల చేసిన గవర్నర్

### తొలి విడతగా వెయ్యి కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

అమరావతి కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు బయలు దేరిన సామాగ్రి లారీలు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం మానవ జీవితంలో అంతర్భాగం కావాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విపత్కర పరిస్థితుల కారణంగా సర్వం కోల్పోయిన వారికి ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలన్నారు. తన విచక్షణాధికారాలతో రెడ్ క్రాస్ కు సమకూర్చిన రూ. 25 లక్షల నిధులతో వరద బాధితుల సహాయార్థం సమకూర్చిన సామాగ్రితో సిద్ధం చేసిన లారీలకు గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వివిధ సందర్భాలలో రెడ్ క్రాస్ వాలంటీర్లు అందిస్తున్నసేవలు వెలకట్టలేనివన్నారు. కరోనా కష్టకాలం ఇంకా ముగియ లేదని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముఖముసుగు ధరించటం, చేతులు శుభ్రంగా ఉంచుకోవటం, సామాజిక దూరం పాటించటం తప్పనిసరని గవర్నర్ అన్నారు. తొలి విడతగా వెయ్యి కుటుంబాల కోసం సామాగ్రిని సిద్ధం చేయగా, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో వీటిని రెడ్ క్రాస్ నేతృత్వంలో పంపిణీ చేయనున్నారని రాజ్ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా గవర్నర్ కు వివరించారు. ఒక్కో కుటుంబానికి పదికిలోల బియ్యం, ఒక్కొక్క కిలో కందిపప్పు, పెసరపప్పు, గోధుమపిండి, ఇడ్లీరవ్వ, పంచదార, ఉప్పు, చింతపండు, మిరపపొడి, దుప్పటి తదితర వస్తువులతో కూడిన కిట్ ను అందిస్తున్నామని రెడ్ క్రాస్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి గవర్నర్ దృష్టికి తీసుకు వచ్చారు. తన విచక్షణాధికారాలతో గవర్నర్ వరద బాధితుల సహాయార్థం రూ. 25 లక్షలు కేటాయించటం చిన్న విషయం కాదని రెడ్ క్రాస్ కార్యదర్శి ఎకె ఫరీదా అన్నారు. కార్యక్రమంలో రాజ్ భవన్ సంయిక్త కార్యదర్శి శ్యామ్ ప్రసాద్, ఉప కార్యదర్శి సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేతల ఆగడాలు పరాకాష్టకు చేరాయి: చంద్రబాబు


అమరావతి: కుప్పంలో టీడీపీ కార్యకర్త మురళీపై దాడి చేయడం దుర్మార్గమని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. మురళీ ప్రాణానికి హాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యతనని చెప్పారు. ఏపీలో వైసీపీ నేతల ఆగడాలు పరాకాష్టకు చేరాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిడ్నాప్ చేసి కొట్టడమే కాకుండా.. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ నేతలకు ప్రశ్నించేవారు కనబడకూడదా? రాష్ట్రం మీ జాగీరా? అని ప్రశ్నించారు. పోలీసులు తక్షణమే నిందితులను అరెస్ట్ చేయాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.



## జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ : ఎన్వీ రమణ



### స్వంత ఊరులో సీజేఐకి ఘన స్వాగతం



విజయవాడ డిసెంబర్ 24 సీజేఐ ఎన్వీ రమణ శుక్రవారం పొన్నవరంలోని తన సోదరుడి ఇంటికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఏపీ ప్రభుత్వం తరపున గౌరవ వందనం చేశారు. మంత్రులు పెద్దిరెడ్డి, పేర్ని నాని, అధికార యంత్రాంగం భారీ స్వాగతం పలికారు. అనంతరం పొన్నవరంలో టీటీడీ వేదపండితుల ఆశీర్వచనంతో జ్యోతి ప్రజ్వాలన గావించి పౌర సన్మాన సభను ఎన్వీ రమణ దంపతులు ప్రారంభించారు. పొన్నవరం గ్రామ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అంటూ ఎన్వీ రమణ ఉపన్యాసాన్ని ప్రారంభించారు. ''పొన్నవరం చాలా చైతన్యం ఉన్న ఊరు. ఈ పల్లె ప్రజల ఆశీర్వచనాల కోసం వచ్చాను. నేను ఎక్కడకు వెళ్లినా నా ఊరు ఇదే అని మర్చిపోలేదు. నా చిన్నతనంలో ఏ రకంగా ఇబ్బంది పడలేదు. మా ఊరులో రాజు మాస్టర్ వీధి బడి ఉండేది. రాజు, మార్కండేయులు మాస్టర్లు ఏ నాడు దండించలేదు. 5వ తరగతి వరకు ఇక్కడ. ఏడాది తర్వాత జమ్మవారం కంచికచర్లలో చదువుకున్నా. మా ఊరులో ఏ రోజూ ఏ ఘర్షణ ఉండదు. కులమత తారతమ్యాలు ఇక్కడ ఉండవు. పుట్టిన ఊరుని, కన్నతల్లిని మరచిపోకూడదు.ఢిల్లీకి పోయినా ఈ పల్లెను గౌరవిస్తా. ఆర్భాటంగా ఉండని స్కూలులో చదివాను. నాకు పదేళ్లు వచ్చేసరికే మా ఊర్లో మూడు ప్రధాన రాజకీయపార్టీలు ఉండేవి. మా తండ్రి కమ్యూనిస్ట్ భావజాలంతో ఉంటే నేను స్వాతంత్ర్య పార్టీకి మద్దతిచ్చా. కమ్యూనిస్ట్ పార్టీ డౌన్ డౌన్ అని నినాదాలు చేశాం. చిన్నతనంలో ఎన్జీరంగా మీటింగ్‌లకు వెళ్లా. అప్పట్లో ఈ ప్రాంతం దుర్భిక్ష మెట్టప్రాంతంగానే ఉంది. నేటికి మా ప్రాంతం అనుకున్న అభివృద్ధి సాధించకపోవడం ఆవేదన కలిగిస్తోంది. ఢిల్లీలో తెలుగువాడినని చెపితే అక్కడివారు తమ ప్రాంతంలో పలు ప్రాజెక్ట్‌లు కట్టారని చెపుతారు.

## ఆ సినిమాలకు పెట్టిన ఖర్చెంత.. పవన్ తీసుకున్న రెమ్యునరేషన్ ఎంత?

నెల్లూరు: సినిమా టికెట్ల ధరలపై మంత్రి అనిల్ కుమార్ యాదవ్ స్పందించారు. మంత్రి అనిల్ నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. 'టికెట్ రేట్ తగ్గితే రెమ్యునరేషన్ తగ్గుతుందని వాళ్లు బాధపడుతున్నారు. భీమ్లా నాయక్, వకీల్‌సాబ్‌కి పెట్టిన ఖర్చెంత?. పవన్‌కల్యాణ్ తీసుకున్న రెమ్యునరేషన్ ఎంత..?. ప్రజలని ఉద్ధరిస్తానన్న పవన్ తక్కువ రేటుకే వినోదాన్ని పంచొచ్చు కదా. పవన్ క్రేజ్‌ని అమ్ముకుంటున్నాడు. ఒకప్పుడు నేను కూడా బైక్ అమ్మి పవన్‌కల్యాణ్‌కి కటౌట్‌లు కట్టాను. ఉన్న డబ్బులు ఊడగొట్టుకున్నా. ఇప్పుడున్న అభిమానుల పరిస్థితి కూడా అంతే. ప్రొడక్షన్ కాస్ట్ 30శాతం అయితే రెమ్యునరేషన్ 70శాతం ఉంది. సినిమాకయ్యే ఖర్చులో 80శాతం నలుగురి జేబుల్లోకే వెళ్తున్నాయి. దానికోసం కోట్లాది మంది ప్రజలపై భారంపడేలా సినిమా రేట్లు పెంచమనడం ఎంతవరకు కరెక్ట్ అంటూ మంత్రి అనిల్ మండిపడ్డారు.



## చెరకు రైతుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం: లోకేష్

అమరావతి: చెరకు రైతుల పట్ల వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చాలా దారుణంగా ఉందని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మొన్న ఎన్సీఎస్, నిన్న తాండవ ఫ్యాక్టరీ దగ్గర చెరకు రైతులను పోలీసులు చావగొట్టారు. చెరకు బిల్లులు చెల్లించాలని ఆందోళన చేస్తున్న రైతులపై దాడులు, అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. విశాఖ పాయకరావుపేటలోని తాండవ షుగర్ ఫ్యాక్టరీ దగ్గర.. కౌలు రైతుని సర్కారు మూర్ఖత్వమే బలితీసుకుందన్నారు. పోలీసుల క్రూరత్వంతో కౌలు రైతు నానాజీ మృతి చెందారన్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 24 డిసెంబరు 2021

## క్రిప్టో కరెన్సీలపై వెల్లువెత్తుతున్న ఉత్సాహం

దేశంలో క్రిప్టో కరెన్సీపై పెట్టుబడులు పెడుతున్న వారిలో చాలామంది బోలెడన్ని లాభాలు వచ్చిపడతాయన్న నమ్మకంతో ఉన్నారు. కొంతమందికి డబ్బుల లాటరీ తగలడం వరకూ నిజమే కావచ్చు. కానీ.. మిగిలిన చాలామంది నష్టాల బారిన పడే అవకాశాలే ఎక్కువ. క్రిప్టో కరెన్సీ లావాదేవీలపై భారత్‌లో ఇప్పటికీ సరైన చట్టాలు లేవన్న విషయం గుర్తుంచుకోవాలి. క్రిప్టో వ్యవహారాలు చాలావరకూ అంతర్జాతీయ ప్లాట్‌ఫార్మ్‌పై, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీల ఆధారంగా పనిచేస్తుంటాయి. కాబట్టి నిషేధం విధించడం ఏ రకంగానూ పరిష్కారం చూపదని నిపుణుల భావన. క్రిప్టో కరెన్సీని నిషేధించడం కంటే, దాని నియంత్రణే సరైన మార్గమని పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. దీంతో క్రిప్టో కరెన్సీని చట్టబద్ధంగా పన్ను పరిధిలోకి తీసుకొచ్చి లాభాలపై పన్నులు విధించడంపై కేంద్రం దృష్టి సారించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో క్రిప్టో కరెన్సీ నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టనుందని ఖాయంగా తెలుస్తోంది. భారత్ ఇప్పుడు ఓ కొత్త యుగంలోకి అడుగుపెడుతోంది! క్రిప్టో కరెన్సీలు, ఆస్తుల్లో పెట్టుబడులు పెడుతున్న వారు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నారు. వార్తాపత్రికలు, టెలివిజన్ ఛానళ్లలో ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న ప్రకటనలు క్రిప్టో క్రేజ్‌ను మరింత పెంచాయి. క్రిప్టో సంబంధిత ఆస్తులు, కరెన్సీలపై అన్నివైపులా ఉత్సాహం వెల్లువెత్తుతున్న విషయం నిజమే అయినప్పటికీ ఈ అంశం చుట్టూ ఉండే పరిస్థితులు మాత్రం అంత అనుకూలంగానైతే లేవు. క్రిప్టో కరెన్సీ, ఆస్తుల విషయాల్లో ప్రభుత్వాలు విధానపరంగా ఎలా వ్యవహరిస్తాయి? తప్పులు జరక్కుండా ఎలా నియంత్రిస్తారు? వంటి ప్రశ్నలన్నింటికీ స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. క్రిప్టో వ్యవహారాల్లో ఎలా వ్యవహరించాలన్న అంశంపై భారత ప్రభుత్వం ఇప్పటికీ కొంత అస్పష్టతతోనే ఉన్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి. భారత్‌లో క్రిప్టోకరెన్సీపై ప్రజలు మక్కువ చూపుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో మితిమీరుతున్న క్రిప్టో కరెన్సీ వాడకంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రైవేట్ క్రిప్టో కరెన్సీల నిషేధానికి కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. అదే సమయంలో ప్రభుత్వం ఆమోదించే డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించనున్నారు. ఈ అంశంపై ఇటీవలే వివిధ మంత్రిత్వ శాఖలు, ఆర్బీఐ అధికారులతో ప్రధాని నరేంద్ర మోదీ అత్యున్నత సమావేశం నిర్వహించారు. కొన్నేళ్ల క్రితం ఆర్‌బీఐ క్రిప్టో వ్యవహారాలు నిర్వహించే చట్టబద్ధ సంస్థలకు బ్యాంకింగ్ సర్వీసులు అందవని ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తరువాత సుప్రీంకోర్టు దీన్ని పక్కనబెట్టింది. అయితే ఈ క్రమంలోనే క్రిప్టో అంశాలపై అన్ని నిర్ణయాలు తీసుకునే నోడల్ అథారిటీ ఆర్‌బీఐ మాత్రమేనని కూడా తన చారిత్రాత్మక తీర్పు ద్వారా స్పష్టం చేసింది కూడా. ఇంకోపక్క ఆర్‌బీఐ స్వయంగా తనదైన క్రిప్టో, డిజిటల్ కరెన్సీలను ప్రవేశపెట్టవచ్చునన్న ప్రకటనలూ కొన్ని వెలువడ్డాయి. అయితే ఇక్కడ కొన్ని విషయాలను స్పష్టంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. దేశంలో క్రిప్టో కరెన్సీపై పెట్టుబడులు పెడుతున్న వారిలో చాలామంది బోలెడన్ని లాభాలొస్తాయన్న ఆశతో ఉన్నారు. కొంతమందికి డబ్బుల లాటరీ తగలడం వరకూ నిజమే కావచ్చు. కానీ.. మిగిలిన చాలామంది నష్టాల బారిన పడే అవకాశాలే ఎక్కువ. 2000 నాటి ఇండియన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాన్నే తీసుకుంటే.. క్రిప్టో వ్యవహారాలకు, దీనికీ అస్సలు పొంతన లేకుండా ఉంటుంది. ఈ చట్టంలో క్రిప్టో కరెన్సీ, ఆస్తుల విషయంలో ఎలా వ్యవహరించాలన్న విషయానికి ఏ విధమైన వెసలుబాట్లూ లేవు. క్రిప్టో కరెన్సీలను దృష్టిలో పెట్టుకుని తయారు చేసిన చట్టమే కాదు ఇది. ఐటీ చట్టాన్ని 2008లో చివరిసారి మార్చారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఎన్నో మార్పులు వచ్చిపడ్డాయి. మరీ ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో క్రిప్టో కరెన్సీ, ఆస్తుల వ్యవహారాలు గణనీయంగా పెరిగాయి. ఈ నిమ్మకు నీరెత్తిన ధోరణి ఏమాత్రం సరికాదన్న స్పృహ ఇప్పుడిప్పుడే భారత్ గుర్తిస్తోంది. దీనిపై స్పష్టమైన విధానాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉంది. క్రిప్టో వ్యవహారాలపై నిషేధం విధిస్తారన్న మాటలు వినిపిస్తున్నాయి. అయితే నిషేధాలు అంత మంచిపని కాదన్నది ఇప్పటికే చాలా అంశాల విషయంలో స్పష్టమైంది. పైగా ఇంటర్నెట్ పుణ్యమా అని ప్రపంచమంతా ఒక కుగ్రామమైపోయిన ఈ రోజుల్లో అస్సలు సరి కాదు. క్రిప్టో వ్యవహారాలు చాలావరకూ అంతర్జాతీయ ప్లాట్‌ఫార్మ్‌పై, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీల ఆధారంగా పనిచేస్తుంటాయి. కాబట్టి నిషేధం విధించడం ఏ రకంగానూ పరిష్కారం చూపదు. కాబట్టి నిషేధం కంటే.. క్రిప్టో వ్యవహారాలకు చట్టపరమైన గుర్తింపునివ్వడమే కాకుండా.. కనీస నియంత్రణకు విధానాలు రూపొందించడం మేలు. బెలరూస్, మాల్టాలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు. బ్లాక్‌చెయిన్ ఐలాండ్‌గా పేరొందిన మాల్టాలో వీటికి సంబంధించి మూడు వేర్వేరు చట్టాలు చేశారు. క్రిప్టో వ్యవహారాలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్న దేశాలు కూడా మనం ఏ రకంగా వ్యవహరించాలో తెలిపే సూచికలు అవుతాయి. మొత్తమ్మీద చూస్తే... మన దేశానికి సరిగ్గా సరిపోయే విధానం ప్రపంచంలో ఏ ఒక్క దేశంలో ప్రత్యేకంగా లేదు. అంటే.. పలు దేశాల విధానాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని వాటిల్లోని మంచి అంశాలతో మనకు ఉపయోగపడే విధానాన్ని రూపొందించుకోవాలి. క్రిప్టో వ్యవహారాల్లో కరెన్సీ అంశంపై భారత్‌కు చాలా అభ్యంతరాలు ఉన్నాయి. క్రిప్టో కరెన్సీ కోసం ప్రత్యేకంగా బ్యాంకులేవీ లేని నేపథ్యంలో ఇవేవీ అర్థం చేసుకోలేనంత క్లిష్టమైనవీ కావు. ఈ నేపథ్యంలో భారత్ క్రిప్టో కరెన్సీ విషయంలో సంప్రదాయ మార్గాల ద్వారానే విధాన రూపకల్పన చేయవచ్చు. అందుబాటులో ఉన్న ఆచరణ సాధ్యమైన అంశాలతో మొదలుపెట్టి క్రమేపీ చట్టం పరిధిని విస్తరింపజేయవచ్చు కూడా. ఇంకో ముఖ్యమైన విషయం. బ్లాక్‌చెయిన్/క్రిప్టో వ్యవహారాల్లో పెట్టుబడులు పెడుతున్న వారి రక్షణ కోసం తగిన చట్టాలు అవసరం. అంతేకాదు. క్రిప్టో వ్యవహారాల్లో సేవలందించే వారి కోసం ప్రత్యేక నియమ నిబంధనల అవసరం ఏమీ ఉండరాదు. క్రిప్టో వ్యవహారాలు కేవలం భవిష్యత్తు అంచనాలపైనే ఆధారపడి ఉంటాయన్న విషయం స్పష్టంగా తెలిసినప్పటికీ అవి కాలంతోపాటు పెరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఈ అంశంలో మాత్రం ఏ చట్టం కూడా సాయపడదు. కానీ.. పెట్టుబడులు పెట్టే వారి హక్కులకు రక్షణ ఉండేలా చట్టంలో కొన్ని ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలి. పెట్టుబడిదారుల హక్కుల రక్షణ అన్న అంశం అస్పష్టమైందే. కానీ నిపుణులతో సంప్రదింపులు జరపడం ద్వారా స్పష్టత సాధించాల్సిన అవసరం ఇప్పుడు ప్రభుత్వానికి ఏర్పడింది.

# ఎర్రబంగారానికి మంచి ధర



గుంటూరు, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)రైతు లైఫ్ ఎప్పుడూ లాటరీనే.. పంటకు ఎప్పుడు ధర పెరిగిద్దో.. ఎప్పుడు ఢమాల్ అంటుందో ఎవ్వరూ చెప్పలేరు.. అందుకే కొందరు రైతులు అంటుంటారు.. వ్యవసాయం ఒక జూదమని. రాయలసీమ వరదల సమయంలో ఆకాశన్నంటిన టమాటా ధర.. ఆ తర్వాత వారం రోజులకే కిందకి పడిపోయింది. తాజాగా ఎర్ర బంగారంగా పిలిచే మిర్చి కూడా అధిక ధరలు పలుకుతున్నాయి. దీంతో అన్నదాతలు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ ఏడాది మార్చి నుంచి నవంబర్ వరకు క్వింటా రూ.13, 14 వేల మధ్య కొనసాగిన మిర్చి ధర.. డిసెంబర్‌లో ఒక్కసారిగా రూ.6 వేలు ఎగబాకి క్వింటా రూ.20 వేలకు చేరింది. ప్రస్తుతం మిర్చి పంటకు తామర పురుగు సోకడంతో.. పంటకు తెగులు పట్టింది.. ఈ నేపథ్యంలోనే మిర్చి ధరలు ఒక్కసారిగా పెరిగాయంటూ వ్యాపారస్థులు చెబుతున్నారు. గతేడాది ఎకరాకి 25 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి రావడం.. కల్లాల్లోనే క్వింటా రూ.13 వేలు పలకడంతో ఈ ఏడాది కూడా ఎక్కువ ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. ముఖ్యంగా కృష్ణా జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. తామర పురుగు ఉధృతి ఉన్న నేపథ్యంలో.. మార్కెట్‌కు పంట తక్కువగా వస్తుందన్న నేపథ్యంలో మిర్చి ధరలు క్వింటా రూ.20 వేలకు చేరుకున్నాయని.. ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని రైతు వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు లక్ష టిక్కీల వరకు యార్డుకు మిర్చి వచ్చింది. కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న సరుకు ఎక్కువగా యార్డుకు వస్తోంది. వివిధ వెరైటీల గరిష్ట ధర సగటున క్వింటాలుకు రూ.18 వేలు పలకగా కనిష్ట ధర రూ.9 వేల వరకు పలికింది. గతనెల కంటే ఈ నెలలో ధరల పెరుగుదల ఎక్కువగా ఉంది. గతనెలలో నాన్‌ఎసి కామన్ వెరైటీ సగటు ధర కనిష్టంగా రూ.7 వేలు ఉండగా గరిష్టంగా రూ.12 వేల వరకు పలికింది. తాజాగా ఇదే వెరైటీలు కనిష్ట ధర రూ.7 వేలు, గరిష్ట ధర రూ.16 వేలుగా ఉంది. 20 రోజుల క్రితం నాన్ ఎసి స్పెషల్ వెరైటీల్లో క్వింటాలుకు కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.14 వేలు వచ్చింది. ప్రస్తుతం కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.18 వేల వరకు వచ్చింది. ఇదే రీతిలో ఎసి కామన్ వెరైటటీలు గత నెలలో కనిష్ట ధర రూ.7 వేలు, గరిష్ట ధర రూ.13 వేలు పలికింది. ప్రస్తుతం ఇవే వెరైటీలు కనిష్ట ధర రూ.9300, గరిష్ట ధర రూ.17500 పలికాయి. ఎసి స్పెషల్ వెరైటీల్లో గతనెలలో కనిష్ట ధర రూ.9 వేలు గరిష్ట ధర రూ.14 వేలు రాగా ఈనెలలో ప్రస్తుతం కనిష్ట ధర రూ.7200, గరిష్ట ధర రూ.18 వేలు పలికింది. ప్రతి వెరైటీకి క్వింటాలుకు గరిష్టంగా రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు పెరిగిందని అధికార వర్గాలు తెలిపాయి. మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉండే తేజ, బాడిగ వెరైటీలు రూ.18 వేలు దాటి కూడా పలికాయి. కొంత సరుకు గరిష్టంగా క్వింటాలు రూ.20 వేల వరకు పలికినట్టు వ్యాపార వర్గాలు తెలిపాయి. ఏటా డిసెంబరు 20 కల్లా కొత్త సరుకు మార్కెట్‌కు రావడం అనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది సాగు ఆలస్యమవడం, తామర తెగులు వల్ల పైరు దాదాపు లక్ష ఎకరాల్లో దెబ్బతినడం వల్ల పంట రావడంలో కొంత జాప్యమవుతోంది. ఈ లోగా కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న సరుకును యార్డుకు తీసుకువస్తున్నారు. కోల్డ్ స్టోరేజీల్లో ఇంకా పది లక్షల టిక్కీల వరకు ఉంటుందని, ఈ సరుకు ఈనెలాఖరు కల్లా విక్రయాలు పూర్తవుతాయని జనవరి మొదటి వారం నుంచి కొత్త సరుకు రావడం ప్రారంభం అవుతుందని అధికారులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో మిర్చి సాధారణ విస్తీర్ణం 1.70 లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది 2.65 లక్షల ఎకరాల్లో మిర్చిసాగు చేశారు. అయితే ఇప్పటికే లక్ష ఎకరాల్లో తామర తెగులు వల్ల పైరు దెబ్బతినడం, మరో లక్ష ఎకరాల్లో పంట ఎంత వరకు నిలదొక్కుకుంటుందనేది ప్రశ్నార్ధకంగా మారడంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దీంతో ముందస్తుగానే ఈ ఏడాది వ్యాపారులు ధరలు పెంచి కొనుగోలు చేస్తున్నారు. వచ్చే సీజన్‌లో మిర్చి సరుకు కొరత కూడా ఏర్పడవచ్చని భావించి ముందుగానే కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు.

# సూపర్ స్పెషాలిటీ సేవలకు మోక్షం ఎప్పుడు




కడప, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)కడప జిల్లాలోని రిమ్స్ మెడికల్ కళాశాలలో సూపర్ స్పెషాలిటీ సేవలకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. రాయలసీమ సరిహద్దు జిల్లాలైన కర్నూలు, అనంతపురం, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరుకు చెందిన రోగులు పెద్ద ఎత్తున రిమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్న విషయం తెలిసిందే. రాయలసీమకు నడిబొడ్డున ఉన్న కడప జిల్లాలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాల్సిన అవసరం ఉందనే డిమాండ్ పెద్దఎత్తున వినిపిస్తోంది. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ 23న రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించడానికి రూ.272.81 కోట్ల వ్యయంతో వైఎస్ఆర్ కేన్సర్ కేర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్ కేర్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు మూడు బ్లాక్‌ల నిర్మాణ పనులకు సంబంధించి డిపిఆర్ సర్వే, జ్యుడీషియల్ ప్రివ్యూ, టెండర్ల దశలను దాటలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి, చేసిన శంకుస్థాపనలకు ఏడాదిగా ఎటువంటి పురోగతి లేదు. మూడు బ్లాక్‌ల భవన నిర్మాణాలు పూర్తి చేసుకుని, సుమారు 200 మంది స్టాఫ్ రిక్రూట్‌మెంట్ దశలను దాటుకుని పూర్తి స్థాయిలో సూపర్ స్పెషాలిటీ సేవలు ఎప్పుడు మొదలవుతాయో? తెలియడం లేదు. నత్తనడకన సాగుతున్న సూపర్ స్పెషాలిటీ సేవల పురోగతిని పరిశీలిస్తే... 2019 డిసెంబర్ 19న వంద పడకల సామర్థ్యం కలిగిన రూ.107 కోట్ల వ్యయంతో డాక్టర్ వైఎస్ఆర్ క్యాన్సర్ కేర్ సెంటర్ మంజూరైంది. దీనికి ఈ ఏడాది అక్టోబర్ నెలల్లో టెండర్లు పిలిచారు. నవంబర్ 18న జ్యుడీషియల్ ప్రివ్యూ, టెండర్ల కమిటీ పరిశీలనకు పరిమితమైంది. ఇదే తరహాలో 2019 డిసెంబర్ 21న 90 పడకల సామర్థ్యంతో రూ.40.81 కోట్ల వ్యయంతో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కేర్ హాస్పిటల్ మంజూరైంది. 2019 డిసెంబర్ 22న 504 పడకలు కలిగిన రూ.125 కోట్ల వ్యయంతో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులకు అనుమతులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడాది గడువు పూర్తవుతున్నప్పటికీ డిపిఆర్, టెండర్లు, జ్యుడీషియల్ ప్రివ్యూ, టెక్నికల్ కమిటీ వంటి దశలను అధిగమించడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. దీనికి కారణాలేమిటని పరిశీలిస్తే ఈ ఏడాది మార్చి నుంచి రాష్ట్రంలో కరోనా వైరస్ విజృంభించడం, డ్రాయింగ్ పనులు అప్రూవల్, డిపిఆర్, డిజైన్ల ఎస్టిమేట్లు, జ్యుడీషియల్ ప్రివ్యూ, టెక్నికల్ కమిటీ వంటి దశలను దాటడంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. ఈలెక్కన మరో రెండేళ్లు గడిచినా సూపర్‌స్పె షాలిటీ సేవలు, ఇతర ఆధునిక సేవలు అందు బాటులోకి వచ్చే అవకాశం లేనట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి సూపర్ స్పెషాలిటీ సేవలను అందించడంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బొత్స కుమారుడు ఎంట్రీకి సిద్ధం

విజయనగరం, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో వారసులను హైలైట్ చేయడానికి ప్రయత్నించే నాయకులు ఎంతో మంది ఉన్నారు. తాము వెళ్ళిపోయినా తమ వారసత్వం రాజ్యాలను ఏలాలన్నది నాయకుల ఇన్నర్ ఫీలింగ్. ఇంటికి ఒక రాజకీయనాయకుడు వెలిగాడు అంటే.. ఇంట్లో ఉన్న వాళ్లు మాత్రమే కాదు.. ఇతరులు కూడా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేస్తారు. తాజాగా బొత్స సత్యనారాయణ కూడా వారసుడిని పాలిటిక్స్ లోకి రంగంలోకి దింపాలనే ప్రయత్నాల్లో ఉన్నారు. బొత్స కుటుంబం ముందు నుండి రాజకీయాల్లోకి వస్తూనే ఉంది. బొత్స భార్యను, ఇతర బంధువులను కూడా రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. ఇప్పుడు వారసుడిని రంగంలోకి దించబోతున్నట్టు తెలుస్తోంది. బొత్స భార్య ఝాన్సీ గతంలో విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చేశారు. ఆ తర్వాత ఎంపీగానూ ఉన్నారు. తమ్ముడు అప్పల నర్సయ్యను కాంగ్రెస్ హయాంలోనే ఎమ్మెల్యేను చేయగా, మరో కుటుంబ సభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడిని కూడా నెల్లిమర్ల నుంచి అసెంబ్లీకి పంపించారు. ఇలా ఇప్పటి వరకు భార్య, సోదరుడు, మేనల్లుడిని మాత్రమే రాజకీయాలకు పరిచయం చేశారు బొత్స సత్యనారాయణ. బొత్స కుమారుడు సందీప్‌బాబు రాజకీయాలకు దూరంగా విశాఖలో డాక్టర్‌గా స్థిరపడ్డారు. డాక్టర్ సందీప్ పుట్టినరోజు సందర్భంగా ఎన్నడూ లేనంతగా విజయనగరం అంతా ఫ్లెక్సీలు వెలియడంతో సందీప్ పొలిటికల్ ఎంట్రీ ఖాయమైందని అనుకుంటున్నారు. కుమారుడిని తీసుకుని విజయవాడ వెళ్లిన బొత్స సత్యనారాయణ..

సీఎం జగన్ బర్త్‌డే సందర్భంగా రక్తదానం చేశారు. ఇదంతా పొలిటికల్ ఎంట్రీకి ముందు జరుగుతున్న పరిచయ కార్యక్రమాలని స్పష్టంగా తెలుస్తోంది. ఒకవేళ వారుసుడిని పొలిటికల్ ఎంట్రీ చేయించాలని అనుకుంటే.. ఎక్కడ నుంచి పోటీ చేయిస్తారు అనే చర్చ మొదలైంది అప్పుడే..! చీపురుపల్లి నుంచి స్వయంగా బొత్స ఎమ్మెల్యేగా, గజపతినగరం బొత్స సోదరుడు అప్పలనర్సయ్య, నెల్లిమర్ల బడ్డుకొండ అప్పలనాయుడులతో ఉండగా.. ఇప్పుడు కుమారుడిని ఎక్కడి నుండి దింపుతారనే ప్రచారం జరుగుతూ ఉంది. ఈ రాజకీయాలపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. పలువురు నాయకులు తమ కుమారుళ్లను రాజకీయ నాయకులుగా ఎంట్రీ చేయిస్తున్నారు. త్వరలో బొత్స కూడా ఆ విషయంలో క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

# మీ భద్రత – మా బాధ్యత

## తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం డయల్ 100 సేవలు

తిరుపతి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల భద్రతపై ప్రత్యేక కార్యచరణ చేపట్టి ఎలాంటి ఘటనలకు తావు లేకుండా భక్తులు, యాత్రికుల భద్రతపై దృష్టి సారించి వారి సౌకర్యార్థం 24ీ7 పోలీస్ డయల్ 100 సేవలు అందుబాటులోకి వచ్చింది. తిరుమల లోని వసతి సముదాయాలు, విశ్రాంతి భవనాలు, వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడలీలు, పార్కింగ్ ప్రదేశాల వద్ద సుమారు 50 డయల్ 100 బోర్డు లను జిల్లా పోలీసులు ఏర్పాటు చేసారు. ప్పటికే జిల్లా వ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం స్పైడర్ బ్లూ కోల్ట్ లను ఏర్పాటు చేసి డయల్ 100 కాల్స్ కు తక్షణమే స్పందిచే విధంగా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా స్పైడర్ బ్లూ కోల్ట్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తిరుమలలో కూడా ఇలాంటి సేవలను ప్రజలు, భక్తులు, యాత్రికుల సౌకర్యార్థం వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో డయల్ 100 సేవలను తిరుమలలో ఏర్పాటు చేయడం జరిగింది. ఏదైనా భద్రతా పరమైన ఇబ్బందులు కలిగిన యెడల డయల్ 100 కు తెలియపరిచి సహాయం పొందవచ్చు.

# మత్స్యకారులకు జాక్ పాట్

విశాఖపట్టణం, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)మత్స్యకారులు యథావిధిగా చేపల కోసం వల విసిరారు. నీటిలో పడిన వలను లాగేందుకు చాలా బరువుగా అనిపించింది. మత్స్యకారులు అందరూ కలిసి పైకి లాగారు. అంతే దాన్ని చూసి అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. వలలో చిక్కింది మాములు చేప కాదు.. ప్రపంచంలోనే అతిపెద్దది..! అవును బుధవారం విశాఖ సాగర తీరానికి ప్రపంలోనే అతి పెద్ద చేప వేల్ షార్క్ వచ్చింది. తంతడి బీచ్‌లో చేపల కోసం వల వేసిన మత్స్యకారులకు ఈ భారీ చేప చిక్కింది. ఈ చేప బరువు 50 అడుగుల పొడవు, 2 టన్నుల బరువు ఉంది. ఈ చేపను గమనించిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకాంత్ మన్నెపూరి అధికారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విశాఖ డీఎఫ్‌వో అనంత్‌శంకర్ ఆదేశాలతో సిబ్బంది వెంటనే తంతడి బీచ్‌కు చేరుకున్నారు. తంతడి బీచ్ వద్ద ఉన్న భారీ చేపను పరిశీలించిన వారు.. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద చేప వేల్‌షార్క్ అని తెలిపారు. ప్రస్తుతం ఈ జాతి అంతరించిపోతుందని చెప్పారు. ఈ భారీ చేపను సముద్రంలోకి సురక్షితంగా వదిలిపెట్టాలని డీఎఫ్‌వో అనంత్‌శంకర్ సూచించారు. వెంటనే అటవీ శాఖ సిబ్బంది, మత్స్యకారులు, వన్యప్రాణుల సంరక్షకులు షార్క్‌కు ఫిల్టర్ ఫీడింగ్ ఇచ్చారు. అనంతరం షార్క్‌ను సురక్షితంగా సముద్రంలోకి వదిలిపెట్టారు.

# టాలీవుడ్ లో రాజకీయ రంగు

విజయవాడ, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)ఇంతకీ జనం సినిమా వాళ్ల మీద ఆధారపడ్డారా? సినిమా వాళ్లే జనం మీద ఆధారపడ్డారా? అన్నది ఆంధ్రప్రదేశ్ లో హాట్ టాపిక్ గా మారింది. సినిమా అంశం రాజకీయ రంగు పులుముకుంది. సినిమా టిక్కెట్లను తగ్గిస్తూ ప్రభుత్వం 35 నెంబరు జీవో జారీ చేసింది. ఈ జీవోపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా హైకోర్టు దీనిని కొట్టివేసింది. దీంతో థియేటర్ల యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. కానీ ప్రభుత్వం మాత్రం కావాలని థియేటర్లపై దాడులు చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తుందని సినీ పరిశ్రమలోని ఒక వర్గం ఆరోపిస్తుంది. ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితోనే వ్యవహరిస్తుందని సినీ పరిశ్రమలో కొందరు ఆరోపిస్తున్నారు. వినోదానికి సంబంధించిన అంశంపై ఏకపక్షంగా వ్యవహరిస్తుందని విమర్శిస్తున్నారు. నోటీసులు ఇవ్వకుండా థియేటర్లను పరిశీలించి సీజ్ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తమవుతోంది. చిన్న చిన్న కారణాలను చూపి పదుల సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న సినీ పరిశ్రమను దెబ్బతీస్తుందని ప్రభుత్వంపై ఒక వర్గం ఆరోపణలు చేస్తుంది. సామాన్యులకు.. కానీ డబ్బులు ప్రజల నుంచి తీసుకుని ఏమాత్రం సదుపాయాలు కల్పించని థియేటర్లపైనే చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోంది. కనీసం సదుపాయాలు లేకపోవడం, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచకపోవడం, థియేటర్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించకపోవడం వంటి వాటిపై ప్రభుత్వం సీ?రియస్ గా ఉంది. ఇవన్నీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేసినవేనని చెబుతున్నాయి. సామాన్య ప్రజలకు వినోదాన్ని అతి తక్కువ ధరకు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని ప్రభుత్వం చెబుతోంది.

# సుజనా కష్టం ఫలించినట్టేనా

విజయవాడ, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ బీజేపీకి ఒక రూట్ మ్యాప్ అయితే దొరికినట్లే కన్పిస్తుంది. నిన్న మొన్నటి వరకూ ఎటువెళ్లాలో తెలియక క్రాస్ రోడ్స్ లో ఉన్న నేతలకు అమిత్ షా ఒక రూట్ మ్యాప్ ను రూపొందించినట్లు తెలుస్తోంది. వైసీపీని టార్గెట్ చేయడమే ఈ మ్యాప్ లక్ష్యంగా కన్పిస్తుంది. బలహీనమైన టీడీపీని పట్టుకుని వేలాడే కంటే వైసీపీని టార్గెట్ చేస్తేనే మంచిదన్న ధోరణిలో బీజేపీ కేంద్ర నాయకత్వం ఉన్నట్లు కనపడుతుంది. ఈ నెల 28న ఈ నెల 28 వ తేదీన విజయవాడలో బీజేపీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభ కేవలం వైసీపీని లక్ష్యంగా చేసుకునే నిర్వహిస్తారు. నిన్న మొన్నటి వరకూ వైసీపీకి సానుకూలంగా ఉన్న నేతలందరూ



ఇప్పుడు టోన్ మార్చారు. జీవీఎల్ నరసింహారావు, సోము వీర్రాజులు వైసీపీపై ఒంటికాలిమీద లేవడం కేవలం అమిత్ షా క్లాస్ పీకిన తర్వాతే. ఇప్పుడు బీజేపీ నేతలందరూ వైసీపీని టార్గెట్ చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. మరోవైపు సమయం కోసం కాచుక్కూర్చున్న సుజనా చౌదరి బ్యాచ్ కూడా ఇటీవల యాక్టివ్ అయింది. సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్, సీఎం రమేష్ వంటి నేతలు ఇటీవల ఒంగోలులో వైశ్య సామాజికవర్గానికి చెందిన సుబ్బారావుపై దాడిని ఖండించారు. దీనిపై తనకు పూర్తి వివరాలను పంపితే తాను కేంద్రహోంశాఖకు పంపి నిందితులకు శిక్షపడేలా చూస్తానని చెప్పడం విశేషం. పవన్ కల్యాణ్ ను సంతృప్తి పర్చడమే లక్ష్యంగా బీజేపీ ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తే పవన్ కల్యాణ్ పార్టీకి దూరమయ్యే అవకాశాలు లేకపోలేదు. అందుకే వైసీపీని టార్గెట్ చేసి పవన్ ను తమ వెంటే ఉంచుకోవాలన్న ప్లాన్ లో ఉన్నారు. అందుకే ఈ నెల 28వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభలో ఏపీ ఆర్థిక పరిస్థి?తి, కేంద్రం నుంచి అందుతున్న సాయం, వివిధ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోలేకపోతుందన్నది వివరిస్తారట. అంటే ప్రభుత్వం తాము ఢిల్లీ నుంచి అందిస్తున్న సాయాన్ని కూడా వినియోగించుకోలేకపోతుందని ప్రజలకు వివరించనున్నారు. సుజనా చౌదరి ఢిల్లీలో చేస్తున్న ప్రయత్నాలు చివరి దశకు చేరుకున్నట్లే కనపడుతున్నాయి

# కోనసీమలో మొదటి ఓమిక్రాన్ బ్రేకింగ్..

కాకినాడ కోనసీమ లో మొదటి ఒమెక్రాన్ కేసు నమోదు అయింది. అయినవెల్లి మండలం నేదునూరి సావరం విలేజ్ లో ఓమిక్రాన్ పాజిటివ్ నిర్దారణ అయింది. బాధిత మహిళ ఈ నెల 19వ తేదీన కువైట్ నుండి విజయవాడ మీదుగా వచ్చింది. గన్నవరం ఎయిర్ పోర్ట్ లో సాధారణ కరోనా శ్యాంపుల్స్ సేకరించి పరీక్షించారు. గురువారం ఆర్ధరాత్రి ఫలితాలు వచ్చాయి. ఆమెకు ఓమిక్రాన్ పాజిటీవ్ గా నినార్ధారించారు. దాంతో గన్నవరం నుంచి కోనసీమ వైద్యులకు సమాచారం అందింది. మహిళ రెండు వ్యాక్సిన్ వేయించుకుని కువైట్ నుండి బయలుదేరి వచ్చింది. అప్రమత్తం అయిన అధికారులు, కుటుంబ సభ్యులకు మరోసారి కరోనా పరీక్షలు నిర్వహించారు.

# రెండేళ్లలో రూ.3,500 కోట్ల ఖర్చు

విజయవాడ, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్) ఉపాధి హామీ పథకం నిధులు మంజూరవ్వక గ్రామాల్లో పంచాయతీ, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) భవన నిర్మాణాలు స్తంభించాయి. లక్షలాది రూపాయలను పెట్టుబడి పెట్టి భవనాలను నిర్మిస్తున్నా, అరకొర బిల్లులే మంజూరవుతున్నాయి. ఇప్పటికే అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నిర్మాణాలు చేపడుతున్నా నెలల తరబడి బిల్లులు పెండింగ్ ఉండటంతో ఇక తాము పనులు చేయలేమంటూ కొందరు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో జరిగిన పని విలువ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 40 శాతం మెటీరియల్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి ఉండగా, తాత్సారం చేస్తోంది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.6,625 కోట్లను రాష్ట్రానికి కేటాయించింది. కరోనా నేపథ్యంలో రాష్ట్రంలో ఎనిమిది నెలల్లోనే రూ.7,376.41 కోట్ల విలువైన ఉపాధి పనులు జరగడంతో, సుమారు రూ.3 వేల కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ రావాల్సి ఉంది. ఇప్పటి వరకు కేంద్రం ఆగస్టు, సెప్టెంబరులో రెండు విడతలుగా రూ.1,703.88 కోట్లను మాత్రమే విడుదల చేయగా, మరో రూ.1,800 కోట్లు రావాల్సి ఉంది. ఎపికి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.1,300 కోట్లే పెండింగ్‌లో ఉన్నట్లు ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ప్రకటించడం గమనార్హం. ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3,500 కోట్లపైనే ఖర్చు చేసింది. అందులో రూ.1,872 కోట్లతో 10,365 గ్రామ పంచాయతీ, సచివాలయ భవన నిర్మాణాలను, రూ.781 కోట్లతో రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) నిర్మాణాలను రాష్ట్రప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు సుమారు రూ.3,500 కోట్లను ఖర్చు చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ నుంచి మెటీరియల్ కాంపోనెంట్‌ను విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంచాయతీ, సచివాలయ, ఆర్‌బికె భవన నిర్మాణాలు స్తంభించాయి. రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యాలయ భవనాలు సిబ్బందికి చాలకపోవడంతో ప్రత్యేకంగా సచివాలయాలను నిర్మిస్తున్నారు. ఆ భవనాలు అసంపూర్తిగా ఉండటంతో ఇరుకు గదులలోనే సిబ్బంది విధులను నిర్వర్తించాల్సి వస్తోంది. చేసిన పనులకు కూడా బిల్లులు మంజూరు కాకపోతే ఎక్కడ నుంచి డబ్బులు తేవాలని భవన నిర్మాణాల పనులు చేపట్టిన ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల భరోసాతో రెండేళ్లగా గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె భవనాలను నిర్మిస్తున్నా, బిల్లులు ఎపుడు మంజూరవుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తి చేయాలంటే తక్షణమే మెటీరియల్ కాంపోనెంట్‌ను విడుదల చేయాలని ఇటీవల పంచాయతీరాజ్ అధికారులు కేంద్రాన్ని కోరినా ఎలాంటి ఫలితం లేదు.

## హిందువుల పండుగలంటే జగన్‌కి చిన్నచూపు

### ఏపీలో పథకం ప్రకారం ఆలయాలపై దాడులు: స్వామి పరిపూర్ణానంద

అమరావతి డిసెంబర్ 24 సీఎం జగన్‌రెడ్డిపై స్వామి పరిపూర్ణానంద తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..గతంలో డెల్టా పేరుతో పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టిందన్నారు.ఒమైక్రాన్ దృష్ట్యా క్రిస్మస్‌పై ఎందుకు ఆంక్షలు పెట్టడం లేదని ప్రశ్నించారు. హిందువుల పండుగలపైనే జగన్‌కి కరోనా గుర్తుకువస్తుందా అని నిలదీశారు. హిందువుల పండుగలంటే జగన్‌కి చిన్నచూపన్నారు. ఏపీలో పథకం ప్రకారం ఆలయాలపై దాడులు చేశారని మండిపడ్డారు. అంతర్వేది



ఘటనా నిందితులను ఇప్పటికీ పట్టుకోలేదని చెప్పారు. పింక్ డైమండ్ అని ఎన్నికల ముందు అభూత కల్పన సృష్టించారన్నారు. నిజంగా పింక్ డైమండ్ ఉందా లేదా తేల్చాలని ప్రశ్నించారు. టీటీడీకి నిధులు కావాలంటే వేరే మార్గాలు ఎంచుకోవాలన్నారు. స్వామి మీద ప్రయోగాలు చేయడం తగదన్నాదు.దేవుడి సేవలు అని చెప్పి డబ్బు సంపాదించడం మానేయాలని హితవు పలికారు. టీటీడీ లక్ష్యం వేదాన్ని రక్షించడమేనని పరిపూర్ణానంద తెలిపారు.

## చిన్నారుల కళ్లలో వెలుగులు నింపిన క్రిస్మస్

కడప డిసెంబర్ 24ప్రతి ఒక్కరి కళ్ళల్లో ఆనందం నింపడమే క్రిస్మస్ పండుగ ముఖ్య ఉద్దేశం అని రిమ్స్ వైద్యులు, సర్జన్ అండ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గురవయ్య అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో, సికె దిన్నె మండల పరిధిలోని సాయిబాబా నగర్ (యనాదికాలనీ)లో పేద పిల్లలకు ఆట బొమ్మలు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ,రెండు అంగీలు ఉన్నవారు లేని వానికి ఒక అంగీ ఇవ్వమని చెప్పిన కరుణామయుని వాక్యానుసారం లేని వారికి సహాయం చేసి వారి కుటుంబాలలో వెలుగులు నింపాలని ఆయన కోరారు. పేదప్రజలకు, లేనివారికి సహాయం చేయటం శాంతి సేవ సొసైటీకి వారి బృందానికి అభినందనలు తెలిపారు.సమాజంలో ఆర్థిక లేమితో పేద వారు కావచ్చు కానీ దేవుని రాజ్యానికి వారసులు పేదలే అని ఒక్కనించారు.కష్టాలలో ఇబ్బందుల్లో ప్రజలు ఉన్నప్పుడు తోటి మనుషులే వారిని ఆదుకోవాలి కానీ వేరెవరో ఆదుకోరని ఆయన అన్నారు.మనం జీవించడమే జీవితం కాదని ఇతరుల జీవితాల్లో కూడా సంతోషం వెలుగు నిండేలా చేయడమే నిజమైన క్రిస్మస్ పండుగ అని తెలిపారు.మనుషులకు క్రిస్తు బోధనలు ఇంకా బోధపడలేదని కనుకనే విందులు వినోదలు హంగు హార్బటలు తో విలువైన జీవితాన్ని సద్వినియోగం చేసుకోవడంలో అమడదురంలో ఉన్నారని అన్నారు.రానున్న రోజులలో శాంతి సేవా సొసైటీ మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందాలని ఆయన కాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మడగల ప్రసాద్, సొసైటీ సభ్యులు షద్రక్, స్రవంతి,అమృత, తదితరులు పాల్గొన్నారు.

# శిల్పా కు బెయిల్

హౌదరాబాద్, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)కిట్టి పార్టీల కిలాడీ.. శిల్పా చౌదరికి ఎట్టకేలకూ బెయిల్ మంజూరైంది. ఉప్పర్‌పల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. అధికవడ్డీ, పెట్టుబడులు, కిట్టీపార్టీల పేరుతో కోట్లు కొల్లగొట్టినట్లు ఆమె ఆరోపణలు ఎదుర్కొంటోంది. కిట్టిపార్టీల పేరుతో టాలీవుడ్ ప్రముఖులు, ఇతరులను మోసం చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన శిల్పాచౌదరి.. గత కొన్ని రోజుల నుంచి జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఆమె మూడు కేసులను విచారించిన ఉప్పర్‌పల్లి కోర్టు.. మొత్తం కేసుల్లోనూ ఆమెకు బెయిల్ మంజూరు చేసింది. పలుసార్లు బెయిల్ తిరస్కరించగా.. ధర్మాసనం గురువారం కొన్ని షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతి శనివారం శిల్పా చౌదరి నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో హాజరై సంతకం చేయాలనే నిబంధనతో బెయిల్ ఇచ్చారు. 10వేల చొప్పున షూరిటీలు కోర్టుకు సమర్పించాలని కోరింది న్యాయస్థానం. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విదేశాలకు వెళ్లవద్దని కోర్టు నిబంధన విధించింది. దీంతోపాటు ఎవరితోనూ ఫోన్‌లో కానీ, డైరెక్ట్‌గా గానీ కేసు విషయం మాట్లాడకూడదని స్పష్టం చేసింది. ఇక సాక్షులను బెదిరించరాదని శిల్పాచౌదరిని కోర్టు ఆదేశించింది.కిట్టీపార్టీల పేరుతో టాలీవుడ్ ప్రముఖులు, ఇతరులకు మాయమాటలు చెప్పి కోట్ల రూపాయలు కొల్లగొట్టినట్లు శిల్పా చౌదరిపై ఆరోపణలు ఉన్నాయి. చిట్టీలు మొదలు..కిట్టీపార్టీల వరకు అనేక రంగాల్లో వేలు పెట్టిన శిల్పపై పెద్ద మొత్తాల్లో తమకు డబ్బులు చెల్లించాలంటూ చాలామంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇప్పటివరకూ సుమారు 200 కోట్ల రూపాయలు సంపాదించినట్లు తెలుస్తోంది.

# సంక్రాంతి.. ఫుల్ రష్

విజయవాడ, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)పండగలు పబ్బాలు వచ్చాయంటే సిటీలో ఉద్యోగాలు చేస్తున్న వారంతా ఇంటి బాట పడుతూ ఉంటారు. ముఖ్యంగా పండగల సీజన్ వచ్చింది అంతే చాలు సొంతూళ్ళకు వెళ్లే వారికి కష్టాలు మొదలు అవుతాయి. ఏ బస్సు ఎక్కినా కిక్కిరిసిపోయే జనాలు ఉంటారు. ఇక సంక్రాంతి పండగకు కూడా పరిస్థితులు అలాగే ఉంటాయట. పండగకు 20 రోజులు వుండగానే ఇప్పటికే జనవరి 7-14 మధ్యన రైళ్లు, బస్సుల్లో సీట్లన్నీ బుక్ అయిపోయాయట.ఇక హైదరబాద్ మరియు విజయవాడ నుండి వైజాగ్ వెళ్లే రైళ్లకు బస్సులకు డిమాండ్ ఎక్కువగా ఉండగా రైళ్లలో అయితే వెయిటింగ్ లిస్టు దాటిపోయి రిగ్రెట్ వస్తుందట. అయితే హైదరాబాద్ కు వెళ్ళే రైళ్లలో మాత్రం బెర్తులు కాళిగా ఉన్నట్టు తెలుస్తోంది. దాంతో స్పెషల్ రైళ్లు వేస్తారా అని ప్రయాణికులు ఆశిస్తున్నారు..దీనిపై రైల్వేశాఖ, ఆర్టీసి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. తెలుగువారికి అతి పెద్ద పండగ.. సంక్రాంతి.. దీంతో సంక్రాంతి వస్తుంటే.. నగర ప్రజలు పల్లె బాట పడతారు. తమ కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండగను సంతోషంగా గడపాలని ఇంటికి వెల్దామనుకుంటారు. అటువంటి వారికి ప్రయాణం చేయడంలో అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. ముఖ్యంగా రైళ్లు, బస్సుల్లో రద్దీ నెలకొంటుంది. ఇప్పటికే జనవరి 7నుంచి జనవరి 14వరకూ ముందస్తు రిజర్వేషన్లతో రైళ్లలో, బస్సుల్లో బెర్తులు, సీట్లు ఫుల్ అయ్యాయి. ముఖ్యంగా సంక్రాంతి సీజన్ లో హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖ వైపు వెళ్లే రైళ్లకు, బస్సులకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. ట్రైన్స్ లో అయితే కనీసం కాలు పెట్టె పరిస్థితి కూడా ఉండదు. వెయిటింగ్ లిస్ట్ కూడా భారీగా ఉంది. దీంతో దక్షిణ మధ్య రైల్వేశాఖ స్పెషల్ రైళ్లను ఏర్పాటు చేసింది.హైదరాబాద్ నుంచి విజయవాడ నుంచి వెళ్లే గోదావరి జిల్లాల బస్సులతో పాటు, ఉత్తరాంధ్రవైపు వెళ్లే బస్సుల రిజర్వేషన్ ఇప్పటికే పూర్తి అయింది. జనవరి 8 నుంచి 14వ తేదీల మధ్య విశాఖపట్నం మీదుగా వెళ్లే విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే ఆర్టీసీ బస్సుల రిజర్వేషన్ ఇప్పటికే పూర్తి అయింది. ఇప్పటికే రెగ్యులర్ బస్సుల్లో సీట్లు ఫుల్ అవుతుండడంతో.. ఇక స్పెషల్ సర్వీసులకు రిజర్వేషన్ కు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.కరోనా తగ్గుముఖం పడుతుందంటూ కరోనా నిబంధనలు అనుసరిస్తూ.. ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణం చేసేలా ఏపీఆర్టీసీ సంక్రాంతికి స్పెషల్ బస్సులను ఏర్పాటు చేస్తోంది. సంక్రాంతికి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కృష్ణా రీజియన్ నుంచి 1,266 ప్రత్యేక బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌కు 362, విశాఖపట్నానికి 390, రాజమండ్రికి 360,చెన్నైకి 20, బెంగళూరుకు 14, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు 120 బస్సులను నడపనున్నారు.రోజూ విజయవాడ నుంచి విశాఖపట్నం మీదుగా నిత్యం 85 ట్రైన్స్ కు పైగా ప్రయాణిస్తున్నాయి. అయితే రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి రైళ్లలో రిజర్వేషన్ కు ఆకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం కొన్ని సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగిలిన అన్ని ట్రైన్స్ అడ్వాన్స్ బుకింగ్ తో బుక్ అయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రకు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. దీంతో ముందస్తు రిజర్వేషన్లతో ట్రైన్స్ ఫుల్ అయ్యాయి.

# జూన్ నుంచి సాగుకు మీటర్లు

కర్నూలు, డిసెంబర్ 254, (న్యూస్ పల్స్)వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కర్నూలు జిల్లాలో జోరుగా సన్నాహాలు సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి నుంచి రైతుల నుంచి సమ్మతి పత్రాలు తీసుకుంటున్నారు. ఆయా రైతులతో నాన్ ఆపరేటివ్ బ్యాంకు ఖాతాను తెరిపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం చేపట్టే బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించింది. నాన్ ఆపరేటివ్ బ్యాంకు ఖాతాను నిర్వహించేందుకు రైతులకు వీలు కాదు. డబ్బులు జమ చేయడం, తీసుకోవడం అన్నీ ప్రభుత్వం, బ్యాంకు చేతుల్లోనే ఉంటాయి. రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాల్లో దీన్ని పైలట్ ప్రోగ్రాముగా ప్రభుత్వం చేపట్టి ఇప్పటికే పూర్తి చేసింది. కర్నూలు జిల్లాలో కూడా దీన్ని అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈ ప్రక్రియ జూన్ నాటికి పూర్తి చేసి జులై నుంచి మీటర్ల బిగింపు చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు. మీటర్ల బిగింపు ప్రక్రియను రాష్ట్రమంతా ప్రారంభించేందుకు ఏర్పాట్లు సాగుతున్నట్లు సమాచారం. కర్నూలు జిల్లాలో రెండు లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి సంబంధించి విద్యుత్ పంపిణీ సంస్థ, రైతుల మధ్య ఒప్పంద ప్రక్రియ కోసం ప్రయివేట్ ఏజెన్సీ ప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతుల నుంచి సంతకాలు తీసుకుంటున్నారు. 'ఉచిత విద్యుత్తు వినియోగానికి మంజూరు చేసిన రాయితీ నగదును ప్రత్యేక బ్యాంకు ఖాతాకు విడతల వారీగా బదిలీ అయిన వెంటనే ఆ మొత్తాన్ని విద్యుత్ పంపిణీ సంస్థ బ్యాంకు ఖాతాకు బదిలీ చేసేందుకు నా సమ్మతి తెలియజేస్తున్నాను' అని రైతులతో సంతకాలు చేయించుకుంటున్నారు.స్మార్ట్ మీటర్ల బిగింపు కోసం ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఏ సంస్థా ముందుకు రాకపోవడంతో మళ్లీ టెండర్లు పిలిచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. 5 హెచ్‌పి మోటారుకు గంటకు 3.75 కిలోవాట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. రోజుకు తొమ్మిది గంటలు మోటరు వాడితే రోజుకు 33.75 యూనిట్లు, నెలకు 1012 యూనిట్ల విద్యుత్ ఖర్చవుతుంది. ఒకవేళ లోవోల్టేజీ సమస్య తలెత్తినప్పుడు, పంపుసెట్టుకు అదనంగా పైపులు వేసి దూర ప్రాంతానికి తరలించినప్పుడు తప్పనిసరిగా అదనపు విద్యుత్తు ఖర్చు కానుంది. పంపుసెట్లు కాలిపోయినప్పుడు మళ్లీ రీవైండింగ్ చేసి వాడుకొంటున్న వాటికి కూడా అదనపు విద్యుత్ ఖర్చయ్యే అవకాశం ఉంది.

రైతులు తమకు కేటాయించిన విద్యుత్ కంటే ఎక్కువ విద్యుత్‌ను వాడితే అభివృద్ధి నిధులను చెల్లించాలని షరతు విధించినట్లు తెలుస్తోంది. రైతులకు సరైన అవగాహన కల్పించకుండా వారిపై ఒత్తిడి తెచ్చి అంగీకార పత్రాల మీద సంతకాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం చేపట్టనున్న స్మార్ట్ మీటర్ల విధానం ఉచిత విద్యుత్‌కు స్వస్తి పలికేలా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నారు. జిల్లాలో రైతుల నుంచి సంతకాలు తీసుకుంటున్న మాట వాస్తవమే. రైతుల పేరుతో ఖాతాలను తెరవనున్నారు. ఆ ఖాతాల్లో ప్రభుత్వం విద్యుత్ రాయితీని జమ చేయనుంది. మరో ఆరు నెలల తరువాత మీటర్ల బిగింపు ప్రక్రియ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. మీటర్ల బిగింపు వల్ల ఎంత విద్యుత్ వాడుతున్నారో తెలుస్తుంది. మీటర్ల కోసం రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన పనిలేదంటున్నారు. కె.శివప్రసాద్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ

# కరోనాతో కనిపించని న్యూ ఇయర్ జోష్




హైద్రాబాద్, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)మామూలుగా అయితే మెట్రో నగరాల్లో నెల రోజుల ముందే న్యూ ఇయర్ జోష్? మొదలవుతుంది. పార్టీలు, స్పెషల్? ప్రోగ్రామ్స్? అంటూ హోర్డింగ్?లు కనిపిస్తాయి. పలు రిసార్టులు, స్టార్ హోటళ్లు న్యూఇయర్? ఈవెంట్స్? పేరుతో హడావుడి చేసేవి. షాపులు ఫుల్? అయ్యేవి. ఈ ఏడాది మాత్రం ఇలాంటివేమీ కనిపించడం లేదు. కరోనా భయమే ఇందుకు కారణం. ఏటా డిసెంబర్ మొదటి వారం నుంచే న్యూ ఇయర్ ప్లాన్స్ , ప్యాకేజ్ లు, సెలబ్రేషన్స్ పై ఈవెంట్స్ గురించి ఆర్గనైజర్స్ పబ్లిసిటీ చేసేవాళ్లు. కొత్త సంవత్సరానికి మరో తొమ్మిది రోజులే ఉన్నా, ఈసారి ఎలాంటి సందడీ కనిపించడం లేదు. లాక్ డౌన్ ఎత్తేస్తూ పలు సార్లు కేంద్రం గైడ్ లైన్స్ ను విడుదల చేసింది. సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్ కు, పెళ్లిళ్లకు అనుమతులు ఇచ్చింది. అయితే న్యూ ఇయర్ వేడుకలపై ఇంత వరకు గైడ్ లైన్స్ రాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్రం గైడ్ లైన్స్ కోసం ఎదురుచూస్తున్నాయి. వాటి ప్రకారం నిర్ణయాలు ఉండొచ్చని ఆఫీసర్లు చెబుతున్నారు ఈ నెల 26 నుంచే రిస్ట్రిక్షన్లు పెట్టింది. 30,31ల్లో కర్ఫ్యూ విధించింది. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం కోసం ఈవెంట్ ఆర్గనైజర్లు ఎదురు చూస్తున్నారు. ఏపీ ప్రభావం కొంత తెలంగాణపైనా ఉండొచ్చని అంటున్నారు. లాక్ డౌన్ కారణంగా ఈ ఏడాది మార్చి నుంచి హైదరాబాద్‌లో మూత పడిన త్రీ, ఫైవ్, సెవెన్ స్టార్ హోటళ్లు పూర్తిస్థాయిలో ఓపెన్ కాలేదు. దసరా నుంచి పరిమితంగానే కార్యక్రమాలు జరుగుతున్నాయి. న్యూ ఇయర్ వేడుకలు మాత్రం గతంలో మాదిరి జరిగే చాన్స్? కనిపించడం లేదు. పబ్లిక్ కూడా అంత ఇంట్రస్ట్ చూపించటం లేదని హోటల్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. ప్రభుత్వం గైడ్ లైన్స్ ఇచ్చాక ముందుకు వెళతామన్నారు.మూడేళ్లుగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుతున్నం. ఏటా ఎంతో రెస్పాన్స్ ఉండేది. ఈఏడాది కరోనాతో ఈవెంట్స్ చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. డిసెంబర్ 31న కొండాపూర్ లో ఈవెంట్ ప్లాన్ చేశామని. సోషల్ డిస్టెన్స్ రూల్స్? పాటిస్తం. కేవలం 300 మందికి మాత్రమే పర్మిషన్? ఇస్తం. కనీసం పెట్టిన ఇన్వెస్ట్?మెంట్ అయినా వస్తుందా అనే అనుమానం ఉంది. లైసెన్స్, ఇతర పర్మిషన్లు తీసుకుంటున్నం. ఏటా డిసెంబర్ ఫస్ట్ వీక్ నుంచే ఈవెంట్స్ గురించి ప్రచారం చేసేవాళ్లమని వాపోతున్నారు.భారీగా పెరిగిన లిక్కర్ సేల్స్పడిపోతున్న ఉష్ణోగ్రతలు, వణికించే చలి, వెచ్చదనం కోసం డైలీ ఓ పెగ్గు.. ఇప్పుడిదే అబ్కారీ శాఖకు ఆదాయాన్ని పెంచుతోంది. రాష్ట్రంలో చలి తీవ్రత మద్యం వినియోగదారులకు కిక్కెక్కిస్తోంది. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతుండటంతో లిక్కర్ వినియోగం పెరిగింది. దీంతో గ్రేటర్ లో లిక్కర్ సేల్స్ ఊపందుకున్నాయి. కొత్త మద్యం పాలసీ ప్రారంభం నుంచే అమ్మకాలు పెరగడంతో వైన్స్ లు కళకళలాడుతున్నాయి. రెస్టారెంట్లు, బార్లలోనూ మందు వినియోగం పెరిగినట్లు అబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే ఊపు న్యూ ఇయర్ వరకు కొనసాగుతుందని భావిస్తున్నారు. గతేడాది కొవిడ్ కారణంగా చాలా మంది కొత్త సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు. పబ్బులు, బార్లు వెలవెలబోయాయి. కొద్ది రోజులుగా ఒమిక్రాన్ ఆందోళనలు నెలకొన్నప్పటికీ కరోనా తీవ్రత అంతగా లేకపోవడంతో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. గతంలో కరోనా రూల్స్ తో చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. బార్లు తెరిచి ఉన్నప్పటికీ ధైర్యంగా వెళ్లేందుకు వెనుకడుగు వేశారు. ప్రస్తుతం చాలా వరకు సాధారణ పరిస్థితులు నెలకొనడంతో వినియోగం పెరిగింది. దానికి తోడు వారం, పది రోజులుగా రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. దీంతో వణికించే చలి.. మందు వినియోగదారులను మరింత ఉత్సాహపరుస్తోంది. గతేడాది డిసెంబర్ తో పోల్చితే ఈ ఏడాది లిక్కర్ అమ్మకాలు భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. లిక్కర్ కు పోటీగా బీర్ల అమ్మకాలు కూడా బాగా పెరిగాయి.

# ఫ్రీడం డే నిర్వహించిన జేసీ

అనంతపురం ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమంతో సంచలనాలు చేసే తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. తన కార్యక్రమంతో చిరకాల ప్రత్యర్థి అయిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి స్ట్రాంగ్ పంచ్ ఇచ్చారు. ఇంతకీ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన కార్యక్రమం ఏంటి? అంతలా పంచ్ ఏముందు? ఇప్పుడు తెలుసుకుందాం. జేసీ ప్రభాకర్ రెడ్డది తన ఇంటి వద్ద ఫ్రీడం డే పేరుతో సంబరాలు నిర్వహించారు. అదేంటి ఇవాళ ఆగష్టు 15 కాదు.. జనవరి 26 కూడా కాదు కదా అంటే.. మాకు ఇప్పుడే ఫ్రీడం డే వచ్చిందని సంబురాలు చేసుకున్నారు. ఎందుకంటే.. సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజు జేసీ ఇంటికి వార్నింగ్ ఇచ్చేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వచ్చారు. అప్పట్లో జరిగిన గొడవలు దాదాపు 15రోజుల పాటు తాడిపత్రిలో ఉద్రిక్త పరిస్థితులకు దారి తీశాయి. అయితే ఈ సంఘటన తరువాత టీడీపీ కార్యకర్తలు యాక్టీవ్ అయ్యారు. వెంటనే వచ్చిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు జరిగితే.. ఒక్క తాడిపత్రిలో మాత్రమే టీడీపీ జెండా ఎగిరింది. ఆ రోజు జరిగిన సంఘటన కారణంగానే తమ కార్యకర్తలు భయం వీడి.. మనో ధైర్యంతో ముందుకు వచ్చారని, దానికి గుర్తుగా ఫ్రీడమ్ డే సంబరాలు చేసుకున్నామని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇంకా వింత ఏంటంటే.. ఈ వివాదానికి కారణం ఇసుక కావడంతో.. ఒక కేక్‌పై ఇసుక బండి వేయించారు.

## కేసులతో నన్ను వేధిస్తున్నారు– మాజీ మంత్రి ఆవేదన

విజయనగరం, డిసెంబర్ 24, (న్యూస్ పల్స్)నన్ను కేసులతో వేధిస్తున్నారు. సింహాచలం దేవస్థానానికి వెళ్లే ముందు టోల్ గేట్ కూడా కట్టే వెళ్తున్నా. ఒకవేళ టోల్ గేట్ కట్టకపోతే కేసు పెడతారేమోనని భయమేస్తోంది. మాది దేశ ద్రోహ కుటుంబం అని ఒక మంత్రి అన్నారు.. అంటూ అశోక్ గజపతిరాజు ఆవేదన చెందారు.విజయనగరం జిల్లా రామతీర్థం బోడికొండపై నెలకొన్న వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో చోటుచేసుకున్న ఘటనలో మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి, రామతీర్థం ఆలయ కమిటీ చైర్మన్ అశోక్ గజపతిరాజు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రొటోకాల్ బోర్డుపై ఆలయ కమిటీ చైర్మన్‌గా అశోక్ గజపతిరాజు పేరు లేకపోవడంతో మొదలైన ఈ వివాదం.. ఆ తర్వాత ప్రభుత్వం వర్సెస్ టీడీపీ మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది.అశోక్ గజపతిరాజు ఆలయ శంకుస్థాపన కార్యక్రమం, విధులకు ఆటంకం కలిగించారంటూ రామతీర్థం ఆలయ ఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అశోక్ గజపతిరాజు ఏపీ హైకోర్టును ఆశ్రయించి.. నెలిమర్ల పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు.ఈ సందర్భంగా విజయనగరంలో అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ.. నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉన్న రామతీర్థంలో ఎన్నడూ లేని ఘటనలు ఈ ప్రభుత్వ హయాంలో జరగడం చాలా బాధాకరమన్నారు. దేవస్థానానికి సమర్పించే కానుకలకు కూడా మంత్రులు అనుమతులు అడుగుతున్నారని, తాను ఆలయాలకు సంబంధించిన ఏ విషయం అడిగినా అధికారులు చెప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."నన్ను కేసులతో వేధిస్తున్నారు. సింహాచలం దేవస్థానానికి వెళ్లే ముందు టోల్ గేట్ కూడా కట్టే వెళ్తున్నా. ఒకవేళ టోల్ గేట్ కట్టకపోతే కేసు పెడతారేమోనని భయమేస్తోంది. మాది దేశ ద్రోహ కుటుంబం అని ఒక మంత్రి అన్నారు.. ఆయనకి దండం పెట్టాలి. ఆ మంత్రికి మల్లే మా తల్లిదండ్రులు సంస్కారాలు నేర్పించారా అని అనుమానం వస్తుంది" అంటూ కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆవేదన చెందారు.తాను కూడా అలా మాట్లాడి ఉండకూడదని.. తాను ఎప్పటికీ వాళ్ల స్థాయికి దిగజారి మాట్లాడనని.. కేవలం దండం పెట్టడం తప్ప ఏమీ అనలేనని అశోక్ గజపతిరాజు బాధపడ్డారు. తనను విమర్శించే వారిని.. వారి విజ్ఞతకే వదిలేస్తున్నానంటూ వ్యాఖ్యానించారు. ప్రొటోకాల్ విషయం ప్రభుత్వమే చూసుకోవాలని చెప్పారు. మాన్సన్ ట్రస్ట్‌లో ఉన్న 105 దేవాలయాల్లో ప్రతి గుడికి వేర్వేరు ఆచారాలు ఉంటాయని.. ఆచారాల విషయంలో ప్రభుత్వ జోక్యం ఉండకూడదని అశోక్ గజపతిరాజు సూచించారు.

## సామాజిక స్ఫూర్తి మార్గదర్శకులు పెరియార్

### సిఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు....

బెల్లంపల్లి డిసెంబర్ 24సామాజిక స్ఫూర్తి, ప్రేరణ ఉత్తేజం నింపిన మార్గదర్శకులు పెరియార్ రామస్వామి నాయర్ అని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ (సిఓఈ)బెల్లంపల్లి ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. పెరియార్ ఇ వి రామస్వామి 48వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సిఓఈ లో ప్రత్యేక కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు.. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడురూ పెరియార్ రామస్వామి సాంస్కృతిక విప్లవం,సామాజిక సందేశం దక్షిణాది తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ జాతీయులకు ఉద్దేశించినదైనప్పటికీ దేశంలోని ప్రతిఒక్కరినీ ఆలోచింపజేసిందన్నారు. సంఘసంస్కర్తగా సమాజంలోని అనేక అంధ విశ్వాసాలను రూపుమాపడానికి పెరియార్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆత్మగౌరవ ఉద్యమ నాయకునిగా ప్రజల్లో నెలకొని ఉన్న బానిస మన:స్తత్వం స్థానంలో ఆత్మగౌరవాన్ని నింపి స్వయంశక్తితో ఎదగడమెలగో ఉత్తేజ పరుస్తూ చైతన్యం ను నింపిన పెరియార్ ఆయనవల్లనే నేడు విద్యావ్యవస్థలో శాస్త్రీయద్రుక్పథం పెరగడానికి కారణమయ్యిందన్నారు. సమాజాన్ని అందవిశ్వాసాలతోనింపి ప్రజలను పిరికివాళ్ళుగ తయారుచేసే ఏవ్యవస్థనైనా అంగీకరించకూడదన్న పెరియార్ మాట నిజమన్నారు.నాటి సమాజంలోని కులం, మతం పేరుతో జరిగే అమానవీయకరమైన సంఘటనలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రజల్ని చైతన్యం దిశగా నడిపించారన్నారు.పీడితప్రజల పక్షాన నిలిచి వారి సామాజిక ఆర్థిక స్థాయిని పెంచడానికి క్రుషిచేసిన పెరియార్ పోరాట పటిమ నేటి విద్యార్థులకు ఆచరనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మిట్ట రమేష్, అనిరుద్, చందా లక్ష్మీనారాయణ, కట్ల రవీందర్, గాజుల రాజేందర్, ముక్తేశ్వర్, అశోక్, ఉపాధ్యాయులు బొద్దున శ్యామల, శివ,వామన్, రాజేష్, ఐ.మల్లేష్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై 900 కోట్ల విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి
## సిపిఎం డిమాండ్

ఎమ్మిగనూరు డిసెంబర్ 24,( విభారె) పట్టణంలో విద్యుత్ శ్లాబుల్లో మార్పుతో రాష్ట్ర ప్రజలపై తొమ్మిది వందల కోట్ల రూపాయల భారం కోసం కేంద్ర ప్రభుత్వ చట్ట సవరణ రాష్ట్ర ప్రభుత్వం అమలుకు ప్రయత్నించడం సరికాదని సిపిఎం నగర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు ఈ సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్లాబుల మార్పు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు శ్లాబుల మార్పు వలన రాష్ట్ర ప్రజలపై 919 కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు అవకాశం ఉంది తక్కువ ఆదాయం వచ్చే వారికి తక్కువ విద్యుత్ చార్జీలు ఎక్కువ ఆదాయం వచ్చే వారికి ఎక్కువ విద్యుత్ ఛార్జీల విధానం ఇప్పటిదాకా అమలులో ఉన్నది అయితే ఈ చట్టాన్ని సవరిస్తూ నరేంద్రమోడీ ప్రభుత్వం విద్యుత్ చట్టానికి సవరణ చేసి దాన్ని రాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దడం కోసం జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం శర వేగంగా అమలు చేయడానికి మొనగాడు గా ప్రయత్నించడం జరుగుతుంది తక్షణమే ఈ నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు జిఎస్టి రాకముందు తక్కువ ఆదాయం వచ్చే వారు తక్కువ ఎక్కువ వారే ఎక్కువ ఉండేది ఇప్పుడు పన్నుల విధానం మారిపోయింది మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా రాష్ట్రప్రభుత్వం సామాన్యులపై ఎక్కువ భారం పడే విధంగా విద్యుత్ రంగంలో కూడా చట్ట సవరణలతో తక్కువ ఆదాయం వచ్చే వారి మీద భారాలు మోపుతూ విధానాన్ని జగన్మోహన్ రెడ్డి చేపట్టడం సరికాదన్నారు రాష్ట్రానికి ద్రోహం చేసే బిజెపి విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలపరచడానికి ఖండిస్తున్నామన్నారు తక్షణమే ప్రజలు కూడా కొనసాగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు డిమాండ్ చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాపిరెడ్డి, చంద్రారెడ్డి, డి.ఎం. ఓబులేసు పాల్గొన్నారు




# నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వజ్రం లాంటిది
## ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి



నంద్యాల డిసెంబర్ 24,( విభారె) :-నంద్యాల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి శుక్రవారం నాడు 9 మంది లబ్ధిదారులకు ?16.58 లక్షల రూపాయల చెక్కులను నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు 16,58,000 లక్షలు రూపాయలను అందించడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా నేడు పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే మహిళకు తల భాగంలో సమస్య ఉండడంతో ఆపరేషన్ చేయడం జరిగింది ఎంతో ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయన మంచి మనసుతో అత్యధికంగా?8,50,000 లక్షల రూపాయల చెక్కు రావడం జరిగిందన్నారు. అలాగే నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వచ్చిన అమౌంటు ద్వారా పేద ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ఎంతో తోడ్పడుతుందని నంద్యాల నియోజకవర్గ ప్రజల తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల వల్ల హాస్పటల్ కు వెళ్లి ఎంతో డబ్బును ఖర్చు చేసి వైద్యం చేయించడం జరిగిందని మా కష్టాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తించి మా కుటుంబాలకు అండగా ఉండి నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ద్వారా మాకు ఇంతటి సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ అన్నకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్న కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు

# తుగ్గలి కేజీబీవీ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఏపీసీ ఎస్.ఎస్.ఏ వేణుగోపాల





తుగ్గలిడిసెంబర్ 24,( విభారె) మండల కేంద్రమైన తుగ్గలి లో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ను శుక్రవారం రోజున సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేసి

## పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం
## స్వీపర్ లకు షోకాజ్ నోటీసులు జారీ
## కూరగాయలు మరియు పళ్ళ లో నాణ్యత పాటించాలని సిబ్బందికి ఆదేశాలు

అసంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల అపరిశుభ్రంగా ఉండడంతో స్వీపర్ల కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా కూరగాయలు మరియు పళ్లలో నాణ్యత కలిగి ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.నాణ్యత లేని కూరగాయలు సరఫరా చేస్తే కాంట్రాక్టర్ కు నోటీసులు జారీ చేస్తామని ఆయన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి తెలియజేశారు.ప్రభుత్వం బాలికల విద్యకు ఎంతో గొప్ప ప్రాధాన్యత ఇస్తున్నందున కేజీబీవీ లను పాఠశాల స్థాయి నుండి జూనియర్ కళాశాల స్థాయికి తీసుకురావడం జరిగిందని ఆయన తెలియజేశారు.

# హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేయాలి
## ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్ పోస్టులు భర్తీ చేయాలి
## అద్దె భవనంలో ఎమ్మిగనూరు బిసి, ఎస్సీ హాస్టల్స్ నడపటం సిగ్గు చేటు
## ఎమ్మిగనూరులో ఆర్ యు ఎస్ ఎఫ్ ఏపీ ఎ స్ ఎస్ యు ఆధ్వర్యంలో నిరసన ధర్నా




ఎమ్మిగనూరు డిసెంబర్ 24,( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బి భాస్కర్ నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్ నందు ఆర్ యు ఎస్ ఎఫ్ ఏ పీ ఎస్ యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హాస్టల్ విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు.

# కొత్త పింఛన్లు కొరకు సచివాలయంలో నమోదు చేసుకోండి
## సర్పంచ్ పాల్ దినకర్

కౌతాళండిసెంబర్ 24,( విభారె) మండల కేంద్రంలో క కొత్త పింఛన్లు కొరకు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు దగ్గర లో సచివాలయంలో నమోదు చేసుకోవాలని సర్పంచ్ పాల్ దినకర్ పత్రికా సమావేశంలో తెలిపారు. కొత్త పింఛన్లు కొరకు సచివాలయంలో మరియు సమీపాన ఉన్న గ్రామ వాలెంటర్ లను దగ్గర నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్పాల్ దినకర్ ఉప సర్పంచ్ తిక్కయ్య కార్యకర్తలు ఉన్నారు.

# సుకుమార్ స్కూలు మార్చడమే కరెక్టా?



సుకుమార్ అంటే విభిన్నమైన కథలకు పెట్టింది పేరు. అయితే ఆయన గత కొంత కాలంగా తన పంథాని పక్కన పెట్టి ఎలాంటి లెక్కలు...మడతపేచీలు.. మైండ్ దిమ్మదిరిగే స్క్రీన్ ప్లేలకు పని చెప్పకుండా ఒక్క మాటలో చెప్పాలంటే బ్రైన్ ని పక్కన పెట్టి రెగ్యులర్ దర్శకులు తరహాలో మాస్ కి నచ్చే ఊరమాస్ కథల వైపు పయనించడం మొదలు పెట్టారు. తన సినిమాల్లో హీరోకు ఎలాంటి ఎథిక్స్ వుండవు. కానీ అతనే హీరోగా వుండాలి అంటూ అందరిని కన్విన్స్ చేసేస్తుంటారు.ఒక విధంగా చెప్పాలంటే తెలుగు సినిమాల్లో హీరో అంటే 'రాముడు మంచి బాలుడు ...' అనే మాటని రావణుడు మంచి బాలుడు అనే స్థాయికి తీసుకొచ్చిన పూరి జగన్నాథ్ నే మరిపించేంతగా తెలుగు సినిమాల్లో హీరో పాత్రని మలిచిన ఘనత సుకుమార్ దే. పూరి సినిమాల్లో హీరో ఓ పోకిరి.. ఇడియట్.. ఓ దేశ ముదురు... లోఫర్ .. ఓ రోగ్... అయితే సుకుమార్ సినిమాలో మాత్రం చిత్ర విచిత్రమైన క్యారెక్టర్. తనికి ఎప్పుడు ఎలా ప్రేమ పుడుతుందో తెలియదు.ఒకరు ప్రేమిస్తున్నా.. తనకు నచ్చింది కాబట్టి నన్నే ప్రేమించాలని వెంటపడే వ్యక్తి (ఆర్య)... ఫ్రెండ్ ని ప్రేమిస్తున్న యువతిని అవకాశాన్ని బట్టి పెళ్లి చేసుకునే హీరో (ఆర్య -2)... ఎప్పుడూ నేను ముందుండాలి.. నా తరువాతే ఎవరైనా అని అభద్రతా భావంతో రగిలిపోతూ తనని ఎక్కడ ఓవర్ టేక్ చేస్తారేమోనని జలసీ ఫీలయ్యే వాడు (100 % లవ్) .. ఇక 'పుష్ప'ని తీసుకుంటే ఇందులోని క్యారెక్టర్ సమాజంపై పగ పెంచుకుని ఈగోతో రగిలిపోయే వ్యక్తి.సూపర్ స్టార్ మహేష్ బాబు తో చేసిన ఒక్క 'వన్ నేనొక్కడినే' తప్ప సుకుమార్ చేసిన సినిమాల్లో హీరో పాత్ర విలన్ ఛాయాలకు దగ్గరగా వున్నదే. చిత్ర విచిత్రమైన పాయింట్ తో ఎలాంటి లాజిక్ లకు అందకుండా.. అసలు లాజిక్కే లేకుండా సాగుతుంటాయి. ఇలా విచిత్రంగా సాగిన సుకుమార్ ప్రయాణం ఒక్కసారిగా 'రంగస్థలం'తో కొత్తదారి పట్టింది.ఒక విధంగా చెప్పాలంటే ప్రతి సినిమాకు తనదైన మ్యాథమెటిక్స్ లెక్కలతో నడిపిస్తూ సగటు ప్రేక్షకుడిని కన్ఫ్యూజ్ చేసే సుకుమార్ తన స్కూల్కి భిన్నంగా అడుగులు వేయడం మొదలు పెట్టారు.గజిబిజి స్క్రీన్ ప్లేలతో ప్రేక్షకుడి మెదడుని పిండేయడం మానేసి సగటు ప్రేక్షకుడు ఇష్టపడే మాస్ మంత్రాన్ని అందుకున్నారు. రామ్ చరణ్ తో చేసిన 'రంగస్థలం'తో ఈ విషయాన్ని స్పష్టం చేశాడు. నేల విడిచి సాము చేయకుండా ఓ సాదా సీతా రివేంజ్ డ్రామాని తీసుకుని దాన్ని అత్యంత ఆసక్తికరంగా నడిపించిన తీరు రామ్ చరణ్ ని చిట్టిబాబుగా ఆవిష్కరించిన తీరు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది.బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని అందించడమే కాకుండా జాతీయ స్థాయిలో అవార్డుని కూడా తెచ్చిపెట్టింది. దర్శకుడిగా ఈ సినిమా సుకుమార్ కు సరికొత్త ఇమేజ్ని అందించమే కాకుండా దర్శకుడిగా ప్రత్యేకమైన గుర్తింపుని తెచ్చిపెట్టింది.ఈ సినిమాతో వచ్చిన క్రేజ్ ని తన కెరీర్లో వచ్చిన మార్పుని గమనించిన సుకుమార్ వెంటనే తన స్కూల్ మార్చేశాడు. ఇదే ఫార్ములాని అప్లై చూస్తూ 'పుష్ప : ది రైజ్'ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ నెల 17న విడుదలైన ఈ చిత్రంలో 'రంగస్థలం'లో చిట్టిబాబు పాత్రని మించి మరింత మాసీవ్గా మలిచారు.ఇప్పడదే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని సాధిస్తూ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. పార్ 2 లోనూ ఇంతకు మించిన మాసీవ్ సీన్ లని ప్లాన్ చేసిన సుకుమార్ ఇక నుంచి ఇదే స్కూల్ ని కంటిన్యూ చేస్తారని తెలుస్తోంది. సుకుమార్ లో వచ్చిన మార్పుని గమనించిన ఇండస్ట్రీ వర్గాలు మాత్రం సుకుమార్ స్కూల్ మార్చడమే కరెక్ట్ అని ప్రస్తుతం అతను వెళుతున్న పంథా కరెక్ట్ అని కామెంట్ లు చేస్తున్నారు. నిజమే కదూ..

# సెన్సిబుల్ డైరెక్టర్ కు ధనుష్ షాకిచ్చినట్టేనా?

'ఫిదా'తో బ్లాక్ బస్టర్ అందుకోవడానికి శేఖర్ కమ్ములకు మూడేళ్లు పట్టింది. అంతకు ముందు 'అనామిక'తో ఫ్లాపుని చూసిన శేఖర్ కమ్ముల దాదాపు మూడేళ్ల విరామం తరువాత 'ఫిదా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ సినిమా ఆయన కెరీర్కి కొత్త ఊపిరులూదడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని సాధించి శేఖర్ కమ్ముల సత్తా ఏంటో మరోసారి నిరూపించింది. అయితే ఈ సినిమా తరువాత శేఖర్ మరో సినిమాకు మళ్లీ మూడేళ్ల సమయం



తీసుకోవాల్సి వచ్చింది.'లవ్ స్టోరీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. నాగచైతన్య సాయి పల్లవి జోడీగా నటించిన ఈ చిత్రం భారీ విజయాన్ని సాధించి 'ఫిదా' మ్యాజిక్ ని రిపీట్ చేసింది. దీంతో రెట్టించిన ఉత్సాహంతో వున్న శేఖర్ కమ్ముల ఈ మూవీ తరువాత ఏకంగా త్రిభాషా చిత్రంపై కన్నేశారు. తమిళ హీరో ధనుష్ తో తెలుగు తమిళ హిందీ భాషల్లో ఈ మూవీని తీయాలని ప్లాన్ చేశారు. ఈ చిత్రాన్ని'లవ్ స్టోరీ' ప్రొడ్యూసర్స్ ఏషియన్ మూవీస్ ప్రొడ్యూసర్స్ నారాయణ్ దాస్ నారంగ్ పుస్కూర్ రామ్మోహన్ రావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించాలని ప్లాన్ చేశారు.జూన్లో ఈ ప్రాజెక్ట్ ని అఫీషియల్ గా ప్రకటించారు. ధనుష్ హైదరాబాద్ వచ్చి టీమ్ని కలిశారు. నిర్మాతలతో చర్చలు జరిగాయి. అందుకు సంబంధించిన ఫొటోలని కూడా మేకర్స్ మీడియాకు విడుదల చేసి హల్ చల్ చేశారు కూడా. కానీ ఆ తరువాత ఈ ప్రాజెక్ట్ గురించి ఎలాంటి అప్ డేట్ లేదు. ఇదిలా వుంటే హీరో ధనుష్ తెలుగులో తన స్ట్రెయిట్ చిత్రం ఇదే అంటూ ప్రకటించి షాకిచ్చాడు.వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి డైరెక్షన్లో ధనుష్ ఓ సినిమా చేయబోతున్నాడంటూ వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలని నిజం చేస్తూ ధనుష్ తనతో చేస్తున్న ప్రాజెక్ట్ ని ప్రకటించాడు. పైగా తెలుగులో ఇదే తన తొలి చిత్రమని ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. 'రంగ్ దే' మూవీని నిర్మించిన సితార ఎంటర్టైన్మెంట్స్ అధినేత సూర్య దేవర నాగవంశీ .. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ పై మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ వైఫ్ సాయి సౌజన్యతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్టుగా గురువారం ప్రకటించారు.'సార్' పేరుతో తెలుగు తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీంతో ధనుష్ తో శేఖర్ కమ్ముల చేయాలని ప్లాన్ చేసిన సినిమా వెనక్కి వెళ్లినట్టేనని క్లారిటీ వచ్చేసింది. టైటిల్ లుక్ తో పాటు మోషన్ పోస్టర్ ని కూడా రిలీజ్ చేయడంతో ముందు ఈ సినిమాలో పట్టాలెక్కబోతోందని స్పష్టమైంది. తెలుగు తమిళ భాషలతో పాటు హిందీలోనూ విడుదల కానున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ని త్వరలో నే స్టార్ట్ చేసి వచ్చే ఏడాది ప్రథమార్థంలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.'సార్' ఫస్ట్ లుక్ తో పాటు మోషన్ టీజర్ లో టీమ్ ని కూడా ప్రకటించడంతో శేఖర్ కమ్ముల సినిమా వుంటుందా? లేదా అన్న చర్చ కూడా జరుగుతోంది. దీనిపై స్పష్టత రావాలంటే శేఖర్ కమ్ముల తను ధనుష్ తో చేయాలనుకుంటున్న ప్రాజెక్ట్ గురించి అధికారికంగా మరోసారి ప్రకటించాల్సిందే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు.

# డార్లింగ్ ఫ్యాన్స్ కొత్త ప్రభాస్ ను చూస్తారు: పూజ హెగ్డే

తెలుగులో పూజ హెగ్డే స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది. ఈ మధ్య కాలంలో ఆమె చేసిన సినిమాలు .. అవి సాధించిన విజయాలు .. రాబట్టిన వసూళ్లను చూసుకుంటే ఆమె నెంబర్ వన్ పొజిషన్ లో ఉందనే చెప్పుకోవాలి. సన్నజాజి మొగ్గలా చూపులను కట్టిపడేసే పూజ హెగ్డే 'రాధేశ్యామ్' ప్రీ రిలీజ్




ఈవెంట్ లో జిగేల్ మంటూ మెరిసింది. కృష్ణంరాజు మాట్లాడుతున్నప్పుడు పూజ హెగ్డేను అప్పటికప్పుడు స్టేజ్ పైకి పిలిచారు. తనని ఎందుకు పిలుస్తున్నారనే విషయం తెలియక ఆమె అయోమయంలో పడింది.అయితే స్టేజ్ పైకి చేరుకుంటూనే ఆమె కృష్ణంరాజు పాదాలకి నమస్కరించడంతో వేలాది అభిమానుల నుంచి ఆమెకి మంచి మార్కులు పడిపోయాయి. నిజానికి కృష్ణంరాజుకు .. పూజ హెగ్డేకి మధ్య ఇంట్రెస్టింగ్ సంభాషణ నడిచేదే. అయితే ఆయన మాటలకు నవీన్ అడ్డు తగలడం .. పూజ చేతిలో మైకు లేకపోవడం .. మైకు కోసం వెతుకులాట .. ఇదంతా చూసేవాళ్లకి కాస్త ఇబ్బంది కలిగించింది. ఏం చేయాలో పాలుపోని పూజ హెగ్డేతో 'నువ్వేమైనా రోమియోను అనుకున్నావా?' అంటూ సినిమాలో ప్రభాస్ తో అనే డైలాగ్ ను కృష్ణంరాజుతో అనేలా చేయడం మనసుకు కాస్త కష్టాన్ని కలిగిస్తుంది.ఇక ఆ తరువాత స్టేజ్ పై మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు మాత్రం తడుముకోకుండా తనదైన స్టైల్లో నాన్ స్టాప్ గా దంచేసింది. " అందరూ బాగున్నారా .. నిజంగా ఈ రోజున నేను చాలా సంతోషంగా ఉన్నాను. నిర్మాతలు ఈ సినిమాను ఎంతో ప్యాషన్ తో నిర్మించారు. ఇక మా దర్శకుడు రాధాకృష్ణకుమార్ గారు అదే పనిగా సినిమాపై కూర్చున్నారు. తాను అనుకున్నట్టుగా అవుట్ పుట్ వచ్చేంతవరకూ ఆయన మమ్మల్ని వదిలిపెట్టలేదు. వేరే సినిమాల షూటింగ్స్ లో ఉన్నప్పటికీ పిలిచి మరీ చేయించారు.'రాధేశ్యామ్' ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ. ఇందులో ఏదో మేజిక్ ఉంది .. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది. సినిమాటోగ్రఫర్ మనోజ్ సార్ ఈ సినిమాను అద్భుతంగా చిత్రీకరించారు. ముఖ్యంగా నన్ను చాలా అందంగా చూపించారు. 'బాహుబలి' తరువాత ప్రభాస్ చేసిన సినిమా ఇది. ఆ సినిమాకి పూర్తి డిఫరెంట్ గా ఉండే కథ ఇది. డార్లింగ్ ఫ్యాన్స్ కి ఈ సినిమాలో ప్రభాస్ .. నేను ఇద్దరం కూడా కొత్తగా కనిపిస్తాము. అంతా కూడా ఈ సినిమాలో కొత్త ప్రభాస్ ను చూస్తారు. సంక్రాంతికి ఈ సినిమా వస్తోంది .. ఈ సంక్రాంతికి మీరు చాలా లక్కీ" అంటూ ముగించింది.

# మా బంతి పోయింది.. కనబడితే ఇచ్చేయండి!

బిగ్‌బాష్ లీగ్ 2021లో శుక్రవారం మెల్‌బోర్న్ స్టార్స్, హోబర్ట్ హరికేన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక ఆసక్తికర ఘటన జరిగింది. మెల్‌బోర్న్ స్టార్స్ బౌలర్ నాథన్ కౌల్టర్ నీల్ వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్ నాలుగో బంతిని హోబర్ట్ హరికేన్స్ ఓపెనర్ బెన్ మెక్‌డెర్మోట్ డీప్ బ్యాక్‌వర్డ్‌స్క్వేర్ మీదుగా భారీ సిక్స్ కొట్టాడు. అయితే బంతి వెళ్లి స్టేడియం అవతల చాలా దూరంలో పడింది. దీంతో దెబ్బకు అంపైర్లు కొత్త బంతిని తీసుకోవాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియోనే బిగ్‌బాష్ లీగ్ తన ట్విటర్‌లో షేర్ చేస్తూ.." మా బంతి పోయింది.. ఒకవేళ కనిపిస్తే బ్లండ్‌స్టోన్ ఎరీనాకు తెచ్చివ్వండి" అంటూ క్యాప్షన్ జత చేసింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.కాగా




మ్యాచ్‌లో హోబర్ట్ హరికేన్స్ 24 పరుగుల తేడాతో మెల్‌బోర్న్ స్టార్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హోబర్ట్ హరికేన్స్‌కు ఓపెనర్లు బెక్ డెర్మోట్(67 పరుగులు), మాధ్యూ వేడ్(39 పరుగులు) తొలి వికెట్‌కు 93 పరుగుల జోడించి శుభారంభం అందించారు. ఆ తర్వాత వచ్చిన బ్యాట్స్‌మన్ తలా ఒక చెయ్యి వేయడంతో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మెల్‌బోర్న్ స్టార్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు మాత్రమే చేయగలిగింది. జో క్లార్క్ 52 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. జో బర్న్స్ 22, హిల్టన్ కార్ట్‌రైట్ 26 పరుగులు చేశారు.

# జీవితంలో మళ్లీ టెస్టులు ఆడతాననుకోలేదు: కేఎల్ రాహుల్

సౌతాఫ్రికాతో టీమిండియా టెస్టు సిరీస్ ఆడేందుకు రెండు రోజుల సమయం మాత్రమే ఉంది.ఈసారి ఎలాగైనా ప్రొటీస్ గడ్డపై సిరీస్ గెలవాలని టీమిండియా భావిస్తోంది. ఇప్పటికే అక్కడికి చేరుకున్న టీమిండియా జట్టు తమ ప్రాక్టీస్‌లోనూ జోరు పెంచింది. డిసెంబర్ 26 నుంచి ఇరుజట్ల మధ్య బాక్సింగ్ డే టెస్టు మొదలుకానుంది. ఇక గాయంతో రోహిత్ శర్మ దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు దూరమవ్వడంతో కేఎల్ రాహుల్‌తో కలిసి మయాంక్ అగర్వాల్ ఓపెనింగ్ చేయనున్నాడు. అంతేకాదు రోహిత్ గైర్హాజరీలో కోహ్లి కెప్టెన్సీలో కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా విధులు నిర్వర్తించనున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**